పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 726 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ గురువారం 24.09.2026 పేజీలు : 8 వెల : 4/-


## డూండీ గణనాథుడిని దర్శించుకున్న నారా లోకేశ్



- 72 అడుగుల భారీ మట్టి విగ్రహానికి ప్రత్యేక పూజలు
- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, బుద్దా వెంకన్న
- భవానీపురంలో ఘనంగా కొనసాగుతున్న నవరాత్రి వేడుకలు

విజయవాడ నగరంలోని భవానీపురంలో డూండి గణేశ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా 72 అడుగుల భారీ మట్టి గణపతి విగ్రహాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి లోకేశ్‌తో పాటు ఈ పూజా కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇంఛార్జ్ బుద్దా వెంకన్న, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ తదితరులు

తరువాయి 2లో





## అమరావతికి 'పంచ సూత్రాలు' చంద్రబాబు మాస్టర్ ప్లాన్

తుళ్లూరు మండలంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన

- ఈ కేంద్రం ప్రపంచంలోనే అత్యుత్తమ కంటి వైద్యశాలగా నిలవాలని ఆకాంక్ష
- పంచ సూత్రాల ఆధారంగా అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నామని వెల్లడి
- క్వాంటం వ్యాలీ, హెల్త్ కేర్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతామని హామీ
- రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులకు ముఖ్యమంత్రి ప్రత్యేక అభినందనలు

## రూ.20కే ఫుడ్ టెస్ట్ హర్యానాలో కల్తీకి చెక్!




- హర్యానాలో అందుబాటులోకి మొబైల్ ఫుడ్ టెస్టింగ్ వ్యాన్లు
- కేవలం రూ.20 రుసుముతో ఆహార కల్తీ పరీక్షలు
- 10 నుంచి 12 నిమిషాల్లోనే ప్రాథమిక ఫలితాలు వెల్లడి
- ఎఫ్ఎస్ఎస్ఏఐ అందించిన ఐదు సంచార ప్రయోగశాలలతో తనిఖీలు
- ప్రజల్లో ఆహార భద్రతపై అవగాహన పెంచడమే లక్ష్యం

ఆహార కల్తీని అరికట్టేందుకు, ప్రజలకు సురక్షితమైన

తరువాయి 2లో



## భారీ వర్షా నికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్

- హైదరాబాద్‌లో భారీ వర్షా ల కారణంగా చార్మినార్‌కు స్వల్ప నష్టం
- లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపడిన వైనం
- మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి
- శనివారం వరకు భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన అధికారులు

భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన

తరువాయి 2లో

## గణేశ్ నిమజ్జనం 25న సెలవు.. భారీ బందోబస్తు

- ఏఐ టెక్నాలజీ, డ్రోన్లతో నిమజ్జన ప్రక్రియపై ప్రత్యేక నిఘా
- నిమజ్జనం రోజు నగరంలోకి ప్రైవేట్ బస్సులు, లారీలకు అనుమతి నో
- డీజేలు, అసభ్య నృత్యాలపై కఠిన చర్యలని సీపీ హెచ్చరిక

హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 25వ తేదీన (శుక్రవారం) జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణ సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, నిమజ్జనోత్సవాలను

తరువాయి 2లో





## వందే భారత్‌లో మంటలు.. విజయవాడలో నిలిపివేత

- నర్సాపూర్-చెన్నై వందే భారత్ రైలులో స్వల్ప అగ్నిప్రమాదం
- విజయవాడ సమీపంలో కోచ్ చక్రాల మధ్య చెలరేగిన మంటలు
- పొగలు వ్యాపించడంతో ప్రయాణికుల తీవ్ర ఆందోళన
- ప్రయాణికులంతా సురక్షితం, ఊపిరి పీల్చుకున్న అధికారులు
- మరో రైలులో ప్రయాణికులను చెన్నైకి పంపేందుకు ఏర్పాట్లు

2లో

## H1B ఫ్రాడ్ దర్యాప్తు వేగవంతం.. ఐటీ వర్గాల్లో ఆందోళన

- H-1B వీసాల్లో 20 బిలియన్ డాలర్ల భారీ మోసం జరిగిందన్న అమెరికా
- తమ దర్యాప్తులో ఈ విషయం వెల్లడైందని, అరెస్టులు తప్పవని హెచ్చరిక
- కాగ్నిజెంట్, క్లౌడెరా వంటి కంపెనీల PERM ఫైలింగ్‌లపై ఇప్పటికే సస్పెన్షన్
- H-1B నిబంధనలను కఠినతరం చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్
- అమెరికా చర్యలతో భారతీయ టెక్కీలు, ఐటీ కంపెనీల్లో తీవ్ర ఆందోళన



6లో

## "భారత పాస్‌పోర్ట్‌పై హైదరాబాదీ తీవ్ర నిరాశ.. కారణమిదే!






- ఇండియన్ పాస్‌పోర్ట్ 'పూర్తిగా నిరర్థకమైనది' అంటూ వ్యాఖ్య
- వీసా కోసం రోజుల తరబడి నిరీక్షణ, వేల పత్రాలు ఇవ్వాలంటూ అసహనం
- కోటి రూపాయల వరకు పన్ను కట్టినా ప్రయోజనం లేదని ఆవేదన
- సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు, మొదలైన విస్తృత చర్చ

'భారత పాస్‌పోర్ట్ పరమ చెత్తది' అంటూ హైదరాబాద్‌కు చెందిన ఒక యువ పారిశ్రామికవేత్త చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపుతున్నాయి. అధిక పన్నులు చెల్లిస్తున్నా అందుకు తగిన ప్రయోజనాలు అందడం లేదంటూ ఆయన తన ఆవేదనను వ్యక్తం చేశారు. CozyFarms.in

తరువాయి 2లో

# అమరావతికి 'పంచ సూత్రాలు' చంద్రబాబు మాస్టర్ ప్లాన్

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (LVPEI) నూతన క్యాంపస్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, అమరావతిని ప్రపంచం మెచ్చే నగరంగా, విజ్ఞానం, ఆరోగ్యం, సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ నూతన కేంద్రం కేవలం రాష్ట్రానికే కాకుండా, ప్రపంచ కంటి వైద్య రంగంలోనే ఒక మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు.



### ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలి

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "40 ఏళ్ల క్రితం లాభాపేక్ష లేకుండా, కేవలం ప్రజాసేవ అనే లక్ష్యంతో ప్రారంభమైన ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్, ఇప్పటివరకు మూడు కోట్ల మందికి చికిత్స అందించి చరిత్ర సృష్టించింది. దేశంలో నెంబర్ 1, ఆసియాలో నెంబర్ 2, ప్రపంచంలో 6వ స్థానంలో ఉన్న ఇంతటి ప్రతిష్ఠాత్మక సంస్థ మన అమరావతికి రావడం గర్వకారణం" అని అన్నారు. ఈ సంస్థకు 12 ఎకరాల భూమి కేటాయించామని, భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. "అమరావతిలో ఏర్పాటయ్యే ఈ కేంద్రం ప్రపంచంలోనే నెం.1గా నిలవాలి. చికిత్స, పరిశోధన, పునరావాసం.. ఇలా కంటికి సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రపంచం అమరావతి వైపు చూడాలి" అని ఆయన ఆకాంక్షించారు. సంవత్సరానికి మూడు లక్షల మందికి సేవలు అందించడమే కాకుండా, పరిశోధన, విద్య, శిక్షణ, కమ్యూనిటీ ఐ హెల్త్ వంటి విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ బృహత్కార్యానికి మూలపురుషులైన డాక్టర్ జి.ఎన్. రావు, ప్రధాన దాత జాస్తి వెంకట్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

### ఐదు సూత్రాలతో అమరావతి నిర్మాణం

అమరావతి కేవలం ఒక నగరం కాదని, అది ఒక భవిష్యత్ దర్శనమని చంద్రబాబు అన్నారు. ఐదు ప్రధాన సూత్రాల (పంచ సూత్రాలు) ఆధారంగా నగరాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు.

1. నో పోల్ సిటీ: విద్యుత్, టెలిఫోన్ తీగలన్నీ భూగర్భంలోనే ఉంటాయి. వీధుల్లో స్తంభాలు కనిపించవు.
2. బ్లూ సిటీ: కృష్ణా నది, ఇన్ లాండ్ కాలువలతో నగరం జలకళతో ఉట్టిపడుతుంది. గోదావరి కృష్ణా అనుసంధానంతో నదిలో నీటికి కొరత ఉండదు.
3. గ్రీన్ సిటీ: నగరంలో 50% పైగా పచ్చదనం ఉంటుంది. ఇక్కడి నేల స్వభావం వల్ల పచ్చదనం ఏపుగా పెరిగి ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తుంది.
4. గ్రీన్ ఎనర్జీ: కాలుష్య రహిత, పునరుత్పాదక ఇంధనాన్ని మాత్రమే వినియోగిస్తాం. నగరాన్ని నెట్ జీరో కార్బన్ సిటీగా తీర్చిదిద్దుతాం. ఇక్కడ నివసించే వారి ఆయుష్షు 25 ఏళ్లు పెరుగుతుంది.
5. డీప్ టెక్నాలజీ: అత్యాధునిక సాంకేతికతను జీవితంలోని ప్రతి అణువులో భాగం చేస్తాం.

### టెక్నాలజీ హబ్‌గా అమరావతి

గతంలో తాను ఐటీకి ప్రాధాన్యత ఇస్తే, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి డీప్ టెక్నాలజీలపై దృష్టి సారించినట్లు సీఎం తెలిపారు. "ప్రపంచంలో ఆరు దేశాల్లో మాత్రమే ఉన్న క్వాంటం టెక్నాలజీని అమరావతికి తీసుకొచ్చాం. ఐబీఎం, టీసీఎస్ వంటి సంస్థలతో కలిసి 133 క్యూబిట్ సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 21 క్వాంటం స్టార్టప్‌లు వచ్చాయి. అక్టోబర్ 3న ఐదు కళాశాలల్లో మన వాళ్లు తయారు చేసిన క్వాంటం కంప్యూటర్లను ప్రారంభిస్తున్నాం. మన యువతకు ప్రోత్సాహం ఇస్తే ప్రపంచాన్నే జయిస్తారు" అని ఆయన అన్నారు. స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, సెమీ కండక్టర్ క్లస్టర్లతో అమరావతి భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా మారుతుందన్నారు.

### విజ్ఞానం, ఆరోగ్యానికి కేంద్రం

అమరావతిని ఒక నాలెడ్జ్ ఎకానమీ, హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌గా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తెలిపారు. "ఇప్పటికే ఎస్ఆర్ఎం, విట్, అమృత యూనివర్సిటీలు వచ్చాయి. త్వరలో బిట్స్ పిలానీ, ఎక్స్ఎల్ఆర్ఐ వంటి సంస్థలు రాబోతున్నాయి. మరోవైపు ఎయిమ్స్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, కిమ్స్, ఇప్పుడు ఎల్వీ ప్రసాద్ వంటి సంస్థలతో అమరావతి గ్లోబల్ హెల్త్ హబ్‌గా మారుతుంది. రేపు ప్రపంచమంతా వైద్యం కోసం అమరావతికి వచ్చే రోజు దగ్గరలోనే ఉంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రూ.60,000 కోట్ల విలువైన రోడ్లు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాలు నగరాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని వివరించారు.

### రైతుల త్యాగం చరిత్రాత్మకం

రాజధాని నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులను సీఎం మరోసారి అభినందించారు. "మీరు చేసిన త్యాగం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడింది. ల్యాండ్ పూలింగ్ విధానం, మీ పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. భావితరాలకు మీరు ఆదర్శంగా నిలుస్తారు" అని కొనియాడారు.

### యువతకు పిలుపు

ఈ కార్యక్రమానికి హాజరైన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, "మనం ఒక స్ఫూర్తిదాయకమైన కాలంలో ఉన్నాం. టెక్నాలజీ, నాలెడ్జ్ అందుబాటులో ఉన్నాయి. కావాల్సిందల్లా సరైన నాయకత్వం. ఆకాశమే హద్దుగా ఆలోచించి, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రపంచాన్ని జయించే శక్తి మన యువతకు ఉంది" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎల్వీ ప్రసాద్ సంస్థ ప్రతినిధులు, దాతలు, రైతులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 2027 డిసెంబర్ 27 నాటికి ఈ కేంద్రాన్ని పూర్తిచేసి ప్రారంభిస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు సీఎం తెలిపారు.

## రూ.20కే ఫుడ్ టెస్ట్
# హర్యానాలో కల్తీకి చెక్!

ఆహార కల్తీని అరికట్టేందుకు, ప్రజలకు సురక్షితమైన ఆహారాన్ని అందించేందుకు హర్యానా ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేవలం రూ.20 నామమాత్రపు రుసుముతో, 1012 నిమిషాల్లోనే ఆహార పదార్థాల కల్తీని ప్రాథమికంగా గుర్తించే మొబైల్ ల్యాబొరేటరీలను అందుబాటులోకి తెచ్చింది. ఈ సంచార ప్రయోగశాలల ద్వారా ప్రజలు తాము రోజూ వినియోగించే ఆహార పదార్థాల నాణ్యతను సులభంగా, వేగంగా పరీక్షించుకునే వీలు కల్పించింది. ఈ కార్యక్రమం కోసం భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అందించిన ఐదు మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబొరేటరీలను (వ్యాన్లను) రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టారు. ఈ వ్యాన్లు రొటేషన్ పద్ధతిలో మార్కెట్లు, బస్టాండ్లు, పాఠశాలలు, కళాశాలలు వంటి జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సేవలు అందిస్తాయి. ప్రజలు తమ ఇళ్లలో వాడే పాలు, మసాలాలు, పప్పులు, వంట నూనెలు, ఇతర నిత్యావసర ఆహార పదార్థాల శాంపిళ్లను ఈ వ్యాన్ల వద్దకు తీసుకొచ్చి పరీక్షించుకోవచ్చు. ఈ వ్యాన్లలో ఉండే ఫుడ్ సేఫ్టీ అధికారులు అక్కడికక్కడే ప్రాథమిక పరీక్షలు నిర్వహించి నిమిషాల్లోనే ఫలితాలను వెల్లడిస్తారు. అంతేకాకుండా, అధికారులు కూడా మార్కెట్లలోని దుకాణాల నుంచి అప్పుడప్పుడు శాంపిళ్లను సేకరించి తనిఖీలు చేస్తారు. ప్రాథమిక పరీక్షలో శాంపిల్ కల్తీ అయినట్లు తేలినా లేదా అనుమానాస్పదంగా కనిపించినా, దానిని పూర్తిస్థాయి విశ్లేషణ కోసం పంపి, ఆహార భద్రతా నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.. సామాన్య ప్రజలకు సైతం ఆహార కల్తీ పరీక్షలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడమేనని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుమితా మిశ్రా తెలిపారు. జాతరలు, పండుగల సమయాల్లో కల్తీని అరికట్టేందుకు ఈ వ్యాన్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె వివరించారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా ఆహార భద్రత, ప్యాకెట్లపై ఉండే న్యూట్రిషన్ లేబుల్స్, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను కూడా ఈ మొబైల్ యూనిట్లు నిర్వహిస్తాయని ఆమె పేర్కొన్నారు.

# డూండీ గణనాథుడిని దర్శించుకున్న నారా లోకేశ

విజయవాడ నగరంలోని భవానీపురంలో డూండి గణేశ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా 72 అడుగుల భారీ మట్టి గణపతి విగ్రహాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి లోకేశ్‌తో పాటు ఈ పూజా కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇంఛార్జ్ బుద్దా వెంకన్న, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు. డూండి గణేశ్ సేవా సమితి వ్యవస్థాపకులు డూండి రాకేశ్, ఇతర ప్రతినిధులు మంత్రికి స్వాగతం పలికి, స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రతి ఏటా విజయవాడలో డూండి గణపతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. భారీ విగ్రహం, వైవిధ్యభరితమైన అలంకరణతో ఈ మండపం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఈ ఏడాది కూడా పర్యావరణ హితంగా 72 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

# భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్

భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.

## "భారత పాస్‌పోర్ట్‌పై
# హైదరాబాదీ తీవ్ర నిరాశ.. కారణమిదే!

'భారత పాస్‌పోర్ట్ పరమ చెత్తది' అంటూ హైదరాబాద్‌కు చెందిన ఒక యువ పారిశ్రామికవేత్త చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపుతున్నాయి. అధిక పన్నులు చెల్లిస్తున్నా అందుకు తగిన ప్రయోజనాలు అందడం లేదంటూ ఆయన తన ఆవేదనను వ్యక్తం చేశారు. Cozy Farms.in వ్యవస్థాపకుడైన జితేంద్ర (Jitendra Emmani) 'ఎక్స్' వేదికగా చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం విస్తృతంగా చర్చనీయాంశంగా మారింది. విదేశీ ప్రయాణాల కోసం భారత పాస్‌పోర్ట్ హోల్డర్లు పడుతున్న ఇబ్బందులను జితేంద్ర తన పోస్ట్‌లో ప్రస్తావించారు. "మంచి దేశాలకు వెళ్లాలంటే వీసా కోసం రోజుల తరబడి ఎదురుచూడాలి లేదా వేల పేజీల డాక్యుమెంట్లు సమర్పించాలి. కొన్ని దేశాలకు సులభంగా వెళ్లేందుకు అమెరికా వీసా ఒక షార్ట్‌కట్‌లా పనిచేస్తోంది. అలాంటప్పుడు భారత పాస్‌పోర్ట్ హోల్డర్లకు ప్రయాణ సౌలభ్యం కోసం మరో విదేశీ వీసా ఎందుకు అవసరం కావాలి?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ విధానం భారత పాస్‌పోర్ట్ హోల్డర్ల కదలికలను నియంత్రిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను ఆయన పన్ను చెల్లింపులతో ముడిపెట్టారు. తాను ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపంలో ఏటా రూ.75 లక్షల నుంచి రూ.1 కోటి వరకు చెల్లిస్తున్నప్పటికీ, దానికి ప్రతిఫలంగా స్థానికంగా గానీ, అంతర్జాతీయంగా గానీ తనకు ఎలాంటి ప్రయోజనాలు అందడం లేదని వాపోయారు. దేశానికి అత్యధిక పన్నులు చెల్లిస్తున్న పౌరులకు కూడా కనీస ప్రయోజనాలు దక్కకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రయాణ ఆంక్షలు, వ్యవస్థాగత ఇబ్బందుల వల్లే చాలామంది ప్రతిభావంతులైన భారతీయులు ఇతర దేశాల పౌరసత్వం లేదా పాస్‌పోర్టుల కోసం ప్రయత్నిస్తున్నారని ఆయన విశ్లేషించారు. సమస్యలకు గతాన్ని నిందించడం కంటే ప్రస్తుత సవాళ్లను గుర్తించి, వాటిని పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కాగా, జితేంద్ర అమెరికాలోని నార్తర్న్ ఇల్లినాయిస్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. జితేంద్ర పోస్ట్‌పై ఆన్‌లైన్‌లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది నెటిజన్లు ఆయన వాదనతో ఏకీభవిస్తూ, మెరుగైన అంతర్జాతీయ ప్రయాణ సౌలభ్యం, వ్యవస్థాగత మార్పులు అవసరమని వ్యాఖ్యానించారు. మరికొందరు మాత్రం ఆయన విమర్శలను తప్పుబట్టారు. వీసాల విషయంలో తమ వ్యక్తిగత అనుభవాలు భిన్నంగా ఉన్నాయని,

# గణేశ్ నిమజ్జనం 25న సెలవు.. భారీ బందోబస్తు

హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 25వ తేదీన (శుక్రవారం) జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణ సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. మొత్తం 28,400 మంది సిబ్బందిని భద్రతా విధులకు కేటాయించారు. ఈ నెల 25న నిమజ్జనం ఉండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు వెలువరించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14వ తేదీన (రెండో శనివారం) పనిదినంగా పరిగణించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### నిమజ్జన ఏర్పాట్లపై సజ్జనార్

నిమజ్జన ఏర్పాట్లపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగర పరిధిలో 20,000 మంది, ఇతర జిల్లాల్లో 8,400 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది నిఘా కోసం అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నామని, 24 డ్రోన్లు, 10,000 సీసీటీవీ కెమెరాల ద్వారా నిమజ్జన ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ పరిసరాల్లో 100 హైరైజ్ కెమెరాలు ఏర్పాటు చేశామని, చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల కట్టడికి 25 క్రైమ్ బ్రాంచ్ బృందాలను రంగంలోకి దించినట్లు వివరించారు. మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్' నిఘాను ముమ్మరం చేశామని, ఊరేగింపుల్లో డీజేలు వినియోగం, మండపాల వద్ద అసభ్యకర పాటలు, నృత్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో పాత వీడియోలు లేదా తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేయవద్దని ప్రజలకు సూచించారు. ఖైరతాబాద్ గణనాథుని దర్శన గడువు నేటి (బుధవారం) అర్ధరాత్రితో ముగియనుంది. నిమజ్జనం రోజున నగరంలోకి ప్రైవేట్ బస్సులు, భారీ ట్రక్కుల ప్రవేశానికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.

# వందే భారత్‌లో మంటలు.. విజయవాడలో నిలిపివేత

నర్సాపూర్ నుంచి చెన్నై వెళుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. విజయవాడ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. అయితే, రైల్వే సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా సురక్షితంగా ఉండటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం సాయంత్రం వందే భారత్ రైలు విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రైలులోని సీ4 కోచ్ చక్రాల ఇరుసు వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది వెంటనే రైలును విజయవాడ స్టేషన్‌లో నిలిపివేశారు. అగ్నిమాపక పరికరాల సహాయంతో మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ముందుజాగ్రత్త చర్యగా, ప్రమాదానికి గురైన రైలును స్టేషన్‌లోనే నిలిపి ఉంచి సాంకేతిక తనిఖీలు చేపట్టారు. ప్రయాణికులను వారి గమ్యస్థానమైన చెన్నైకి చేర్చేందుకు ప్రత్యామ్నాయంగా మరో రైలును ఏర్పాట్లు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## సంపాదకీయం

### మంచి ప్రభుత్వం అంటే మౌనమేనా?

# స్కామ్‌ల విచారణలో కూటమి ఎటువైపు?

మాజీ ప్రధాని వీపీ సింగ్ ఒక మానసిక రోగి అని ఆరోపిస్తూ కొందరు న్యాయవాదులు ఒక వ్యాజ్యం దాఖలు చేశారు. అప్పట్లో మండల్ కమిషన్ నివేదికను వీపీ సింగ్ అమల్లోకి తీసుకొచ్చి, ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ప్రకటించారు. దానికి వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళనలతో దేశం అట్టుడికిపోయింది. ఈ క్రమంలో వీపీ సింగ్ మానసిక స్థిరత్వంపై సందేహం వెలిబుచ్చుతూ, ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు దేశంలో శాంతిభద్రతల విఘాతానికి కారణమవుతున్నాయని ఆరోపిస్తూ కేసు దాఖలు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం మరియు రాజ్యాంగ నిబంధనల ప్రకారం మానసిక స్థిరత్వం లేని వ్యక్తి దేశ ప్రధానిగా లేదా ప్రజాప్రతినిధిగా కొనసాగడానికి అనర్హుడు కాబట్టి, ఆయనను పదవి నుండి తొలగించాలని, ఆయన మానసిక స్థితిపై వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. కానీ ఆ కేసు డిస్మిస్ అయింది. అంటే రాజకీయంగా అభిప్రాయభేదాలు ఉన్నా, తమకు నచ్చని నిర్ణయాలు ఎవరైనా మాట్లాడినా “పిచ్చివాళ్ళు” అని ముద్ర వేయడానికి ప్రయత్నం చేస్తారని మొదటిసారి వీపీ సింగ్ కేసులో అర్థమయింది. అయితే వీపీ సింగ్ కేసులో రాజకీయ విభేదాలు ఉన్నవారిని అలా ఇబ్బంది పెడతారనుకున్నాము. ఏపీలో జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, ఒక వ్యక్తిని చంపాలంటే వారిని “పిచ్చివాడు” అని ముద్ర వేయాలనే కొత్త టెక్నిక్ కనిపెట్టారు. కరోనా రోజుల్లో మాస్కులు, పీపీఈ కిట్లు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడు అని ముద్ర వేసి, ఆయనను నడిరోడ్డు మీద కాళ్ళు చేతులు కట్టిపడేసి తీసుకుపోయి పిచ్చాసుపత్రిలో చేర్పించిన విషయం బహుశా భారత రాజకీయాలకే మాయని మచ్చగా భావించవచ్చు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని పిచ్చివారి మధ్యలో ఉంచితే ఏమవుతుందో సుధాకర్‌కు కూడా అదే జరిగింది; ఆయన మరణించారు. చేతికి మట్టి అంటకుండా ఒక మనిషిని చంపడం ఎలాగో సుధాకర్ మరణం మనకు తెలియజేస్తుంది. ఆయన చేసిన ఒకే ఒక్క నేరం—కరోనా రోజుల్లో ప్రాణాలకు తెగించి వైద్యం చేసే డాక్టర్లకు అవసరమైన మాస్కులు, పీపీఈ కిట్లు సరిపడినన్ని లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నదని, ప్రభుత్వం తగినన్ని కిట్లు అందించాల్సిన అవసరం ఉన్నదని మీడియా ముందు మాట్లాడటం మాత్రమే. ఆ నేరానికి ఆధునిక సమాజంలో కనీవినీ ఎరుగని హింసకు గురయ్యారు డాక్టర్ సుధాకర్. ఒక చిన్న విమర్శను తట్టుకోలేని వ్యక్తుల మానసిక స్థితికి వైద్యుడు అవసరమా? లేక ఒకరకంగా ఆరోగ్య అత్యవసర పరిస్థితిలాంటి స్థితిలో ఒక అవసరాన్ని మీడియా ముందు చెప్పినవారికి మానసిక వైద్యులు అవసరమా? అని అడిగే ధైర్యం అప్పుడు ఏ ఉద్యోగ సంఘాలకూ లేకపోయింది. ఇప్పుడు మద్యం స్కాంలో అప్రూవర్‌గా మారిన సత్యప్రసాద్ పరిస్థితి కూడా అదే. ఆయనపైన వైసీపీ చేస్తున్న ఆరోపణ, గతంలో సుధాకర్‌పై చేసిన ఆరోపణే! ఆయనకు “మెంటల్” అని అంటున్నారు వైసీపీ నేత పేర్ని నాని. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారు ఎవరో అందరికీ తెలిసినా, చివరకు సత్యప్రసాద్ నోటి నుండి అది బయటకు వచ్చింది. జగమెరిగిన సత్యమే అయినా పిల్లి మెడలో గంట కట్టింది మాత్రం సత్యప్రసాద్. వెంటనే సత్యప్రసాద్ పిచ్చివాడు అయిపోయాడు! అందుకు సాక్ష్యంగా పేర్ని నాని చూపిస్తున్న డాక్టర్ సర్టిఫికెట్‌లో పేర్కొన్న వ్యాధి ఆయనను పిచ్చివాడిగా ముద్ర వేయడానికి సరిపోతుందా లేదా అనేది విచారణలో వెల్లడవుతుంది. పేర్ని నాని చూపిస్తున్న కాగితం ఆయన మానసిక స్థితిపైన ఇచ్చిన సర్టిఫికెట్ మాదిరిగా ఉన్నది కానీ, ఆ డాక్టర్ చేసిన, చేస్తున్న వైద్యం గురించిన రిపోర్టు కాదు. ఏ డాక్టరూ కూడా డిశ్చార్జ్ రిపోర్టులోనూ, వైద్యం చేసేటప్పుడూ “కుటుంబ సభ్యుల సమక్షంలోనే వైద్యం జరగాలి” అని ప్రత్యేకంగా పేర్కొనరు. మారిన ఈ పరిస్థితిలో ఆ సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్ విచారణకు రావలసి ఉంటుంది. ఆయన ఆ సర్టిఫికెట్ ఏ పరిస్థితుల్లో ఇచ్చారో కూడా వివరించవలసి వస్తుంది. ఆయన అర్హత దగ్గరి నుండి ఆయన చేసిన వైద్యం తాలూకు రిపోర్టు మొత్తం న్యాయస్థానానికి వివరించవలసి వస్తుంది. ఇప్పటి నుండి ఆ సర్టిఫికెట్ ఇచ్చిన వైద్యుడిని ఆయనే కాపాడుకోవాలి. కూటమి ప్రభుత్వం కొలువుతీరగానే మద్యం స్కామ్ బయటకు వస్తుందనీ, సత్యప్రసాద్ ఆ కేసులో ముద్దాయిగా ఉంటారని జగన్ మోహన్ రెడ్డికి తెలుసు. కేసు నమోదు చేసిన తరువాత జరిగే న్యాయప్రక్రియకు ఉపయోగపడుతుందని ముందే తీసుకున్న సర్టిఫికెట్ అది అని అర్థమవుతూ ఉన్నది. న్యాయస్థానం ముందు పేర్ని నాని చేసిన ఆరోపణకు విలువ ఉండదు కానీ, వైసీపీ ప్రణాళిక ఎలా ఉంటుందో ఈ సంఘటన చెబుతున్నది. ఒక నేరస్థుడికి పట్టం కడితే, ఆ నష్టం నుండి బయటపడటం ఎంత కష్టమో ప్రజలకు అర్థమవుతున్నది. వైసీపీలో ఎవరెవరిపైన కేసులు వచ్చే అవకాశం ఉంటుందో వారందరూ వైద్యం చుట్టూ కథలు అల్లుకుంటూ వస్తున్నారు. కొడాలి నాని తన అనారోగ్యాన్ని రెండు సంవత్సరాల నుండి ఎస్టాబ్లిష్ చేసుకుంటూ వస్తున్నాడు. వైఎస్ రాజశేఖర రెడ్డిని నమ్ముకున్న ఆఫీసర్లు జైళ్ల పాలు మాత్రమే అయ్యారు; జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఆయనకు సహకరించిన వారు జైలుకు వెళ్లడమే కాకుండా పిచ్చివాళ్లుగా ముద్ర వేయించుకుంటున్నారు. ఇంకా ఎంతమంది పిచ్చివాళ్లు అవుతారో చెప్పలేం. ఇప్పటివరకు జగన్ మోహన్ రెడ్డి చేసిన స్కాముల్లో జగన్ వైపు వేలు చూపించిన వారు ఎవరైనా మానసిక రోగులే అని ముద్ర వేసే అవకాశం ఉంటుంది. అధికారం ఉన్నంతకాలం ఉన్మాదంతో ఊగిపోయారు. వారూ వీరూ అనే భేదం లేకుండా ప్రత్యర్థుల కుటుంబ మహిళలను ఏ మహిళా భరించలేని విధంగా ప్రేలాపనలు పేలారు వైసీపీ నేతలు. అలాంటి ఉన్మాదులు ఈరోజు వారి నాయకుడు చేసిన అవినీతిని కప్పిపుచ్చడానికి, తాము ఉపయోగించుకున్న అధికారులనే పిచ్చివాళ్లుగా ముద్ర వేస్తున్నారు. ఇటువంటి విషయాలు ప్రజల దృష్టికి వెళ్లకుండా, డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ ఆందోళనల పేరుతో అరాచకం సృష్టిస్తున్నారు. ఆందోళనలలో పాల్గొన్న మహిళలు ఉపయోగిస్తున్న అశ్లీల పదజాలాన్ని గమనిస్తే ఉన్మాదాన్ని ఏ స్థాయిలో పెంచుతున్నారో అర్థమవుతున్నది. ఇలాంటివి చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంటున్నది. అరాచకాలు సృష్టించే ఒక నాయకుడికి కూటమిలోనే ఉన్న బీజేపీ సహాయం చేస్తున్నది. కనీసపు ఆధారాలు లేని చంద్రబాబును అరెస్ట్ చేసే ధైర్యం జగన్ మోహన్ రెడ్డి చేశాడంటే, వెనుక ఉన్న దన్ను అదే. స్పష్టంగా నేరాలు చేసిన దాఖలాలు కనిపిస్తున్నా జగన్ మోహన్ రెడ్డిని అరెస్ట్ చేసే ప్రయత్నం కూడా చేయకుండా కూటమి ప్రభుత్వం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నదంటే, జగన్ వెనుక ఉన్న ఆ దన్నే కారణమని ప్రజలు భావిస్తున్నారు. ఇది కూటమి ప్రభుత్వ వైఫల్యంగా భావించవచ్చు. టీటీడీలో కల్తీ నెయ్యి వ్యవహారం సుబ్బారెడ్డి ఇంటి ముందుకు వచ్చి ఆగిపోయినట్లే, రేపు మద్యం స్కాములో కూడా జగన్ మోహన్ రెడ్డి పీఏ దగ్గరకు వచ్చి ఆగిపోయినా ఆశ్చర్యం లేదు. పాత కేసులు విచారణకు రావు; కొత్త కేసులు జగన్‌ను తాకవు. దానికి చంద్రబాబు నాయుడు పెట్టిన పేరు “మంచి ప్రభుత్వం”. అవసరమున్న దగ్గర కూడా స్పందించని ప్రభుత్వాన్ని మంచి ప్రభుత్వం అని ప్రజలు అనుకోరు. ప్రజలు ఏమనుకుంటారో చంద్రబాబుకు తెలియనిది కాదు. ఇప్పుడు అప్రూవర్‌గా మారిన సత్యప్రసాద్‌తో పాటు ఆయనకు సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్‌కు కూడా రక్షణ కల్పించాలి. చంద్రబాబు ఆలోచించుకోవలసిన విషయం ఒకటుంది: ఒక బలమైన పార్టీ అయ్యుండి సొంత నిర్ణయం తీసుకోవడానికి వెనకాడే చట్రంలో బందీ అయిపోయారు. ఎవరికి వ్యతిరేకంగా కూటమి కట్టారో ఆ నాయకుడి తప్పులను ఒక్క టీడీపీ తప్ప మిగిలిన పార్టీలు ప్రస్తావించను కూడా ప్రస్తావించడం లేదు. గడచిన రెండున్నర సంవత్సరాలలో ఎన్ని స్కాముల్లో నిజాలు నిగ్గు తేల్చారో ఆలోచించుకుంటే ప్రభుత్వ వైఫల్యం స్పష్టమవుతుంది. ఎన్నికల ముందు ప్రస్తావించిన అనేక అంశాలు అధికారంలోకి వచ్చాక ఏమైపోయాయి అని ప్రజలు నిలదీసిన రోజున కూటమి ఏం సమాధానం చెబుతుందో చూడాలి.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 24

SEPTEMBER 24

* 1902: ఇరానీ మతనాయకుడు, పండితుడు ఆయతొల్లాహ్ ఖొమైనీ జననం (మ.1989).
* 1922: తెలుగు నాటక రంగ ప్రముఖులు,సినిమా నటులు ధూళిపాళ సీతారామశాస్త్రి జననం (మ.2007) (చిత్రంలో)
* 1923: ఆంధ్ర కమ్యూనిస్ట్ ఉద్యమ నేతలలో ప్రముఖుడు కొరటాల సత్యనారాయణ జననం (మ.2006).
* 1931: భారత పార్లమెంటు సభ్యురాలు, గాయని మోతే వేదకుమారి జననం.
* 1932: భారత్ లో అణగారిన వర్గాల కొరకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చెయ్యాలనే ప్రతిపాదనపై పూనా ఒప్పందం కుదిరింది.
* 1950: భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు మోహిందర్ అమర్‌నాథ్ జననం.
* 1968: నటి, జంతు సంక్షేమ కార్యకర్త, బ్లూక్రాస్ హైదరాబాద్ కన్వీనర్ అక్కినేని అమల జననం.
* 1998: న్యాయవాది, రాడికల్ హ్యూమనిస్ట్, హేతువాది మల్లాది వెంకట రామమూర్తి మరణం (జ.1918).


ధూళిపాళ సీతారామశాస్త్రి

### ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు..
# సీఎం చంద్రబాబు సమీక్ష

* శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటనున్న వాయుగుండం
* ఉత్తరాంధ్ర జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షా ల సూచన
* గంటకు 85 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం
* యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ తీవ్ర వాయుగుండం శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇది తీరం దాటే సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లు, అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై మంత్రి లోకేశ్ ఫోకస్..
# అధికారులకు కీలక ఆదేశాలు

* రాష్ట్రవ్యాప్తంగా 963 పాఠశాలల్లో హార్ట్‌ఫుల్ యోగా శిక్షణకు చర్యలు
* టెన్త్, ఇంటర్‌లో 90% ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి
* పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
* ఉద్యోగ మేళాల నిర్వహణలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి



విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి, విద్యావ్యవస్థలో మెరుగైన ఫలితాలు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో యోగా శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల బలోపేతం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్య పరిరక్షణకు మిషన్ మోడ్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. దీనికోసం అవగాహన, సంస్థాగత మద్దతు, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం ‘కేర్ ఏపీ’ అనే టూల్‌ను సిద్ధం చేశామని, పైలట్ ప్రాజెక్టు కూడా పూర్తయిందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 963 ప్రభుత్వ పాఠశాలల్లో 4.47 లక్షల మంది విద్యార్థులకు ‘హార్ట్‌ఫుల్ యోగా’ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం సంస్థ ద్వారా 2,000 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించనున్నామని, ఈ ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో, వచ్చే ఏడాది నుంచి పూర్తిస్థాయిలో యోగా తరగతులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. పాఠశాల విద్యలో సంస్కరణల దశ ముగిసిందని, ఇకపై అధికారులంతా ఫలితాలపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని లోకేశ్ స్పష్టం చేశారు. టెన్త్, ఇంటర్మీడియట్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ‘మిషన్ మార్చ్’ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న అధికారులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. బోధనలో వెనుకబడిన ఉపాధ్యాయులకు మెంటార్ టీచర్లతో శిక్షణ తప్పనిసరి చేయాలన్నారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుశాతం పెంచేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (FRS) అమలు చేయాలని సూచించారు.

# ఎఫ్ ఆర్ టి ఐ జాతీయ ప్రెసిడెంట్ మట్టా.ప్రసాద్ తో తిరుపతి లో సమావేశం

- **ఫోరం ఫర్ ఆర్ టి ఐ నేషనల్ జాయింట్ సెక్రెటరీ కుప్పాల.అజయ్ ప్రసన్న కుమార్**



తిరుపతి : ఫోరం ఫర్ ఆర్ టి ఐ వ్యవస్థాపక జాతీయ గౌరవ అధ్యక్షులు ప్రత్తిపాటి. చంద్ర మోహన్ సూచనలతో, బుధవారం నాడు తిరుపతి కి విచ్చేసిన జాతీయ అధ్యక్షులు మట్టా.ప్రసాద్ ను, తిరుపతి లో ఎఫ్ ఆర్ టి ఐ జాతీయ శాఖ సహాయ కార్యదర్శి కుప్పాల.అజయ్ ప్రసన్న కుమార్, ఎఫ్ ఆర్ టి ఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కరాటే డి సి ఎస్ రాయల్, ఎఫ్ ఆర్ టి ఐ ఎంప్లాయ్ వింగ్ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎం.సుధాకర్, రాష్ట్ర ఎంప్లాయ్ వింగ్ కమిటీ మెంబర్ టి.గుణ శేఖర్, జిల్లా స్పోక్స్ పర్సన్ డి.చంద్ర శేఖర్,తిరుపతి జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ యు.జయ లక్ష్మి, తిరుపతి సెక్రటరీ ఏం. శివ,తిరుమల అధ్యక్షులు పి.నాగరాజు రాయల్, తిరుపతి నగర కమిటీ అధ్యక్షులు గుండాల.వేణు నాయుడు, తిరుపతి జిల్లా ఎఫ్ ఆర్ టి ఐ నేతలు టి.శ్రీనివాస్,సతీష్ , బాబు,వెంకటేష్, సుబ్రమణ్యం,తదితర నాయకత్వాలు గౌరవ పూర్వకంగా కలవటం జరిగింది. ఈ సందర్భంగా, ఎఫ్ ఆర్ టి ఐ అన్ని శాఖల నాయకత్వాలు సమావేశంలో, జాతీయ అధ్యక్షులు మానవ హక్కులు,ఆర్ టి ఐ యాక్ట్ అవేర్నెస్ ను, మీటింగ్స్ ద్వారా, అలాగే వివిధ మీడియా మాధ్యమముల ద్వారా అన్ని వర్గాల సాధారణ ప్రజల్లోకి,స్వచ్చంధంగా ఇంప్లిమెంటేషన్ మీద,రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్ ఆర్ టి ఐ మెంబర్ షిప్స్ పెంపుదల మీద, త్వరలో నిర్వహించే రాష్ట్ర వ్యాప్త ఎఫ్ ఆర్ టి ఐ నేతలు, అన్ని జిల్లాల ఆక్టివ్ మెంబెర్స్ , సామాన్య ప్రజల బహిరంగ సభ అంశముల మీద చర్చిస్తూ, రానున్న కాలంలో కూడా నిజాయితీ,నిబద్ధత తో,ఫోరం ఫర్ ఆర్ టి ఐ,గవర్నమెంట్ అన్ని శాఖల అధికారులు తో సమన్వయం చేసుకుంటూనే అవినీతికి వ్యతిరేకంగా, ఎఫ్ ఆర్ టి ఐ నేతలు, ఆక్టివ్ మెంబెర్స్ లీగల్ గా ఉద్యమించాలని , సామాన్య ప్రజల కు కూడా, డైరెక్ట్ గా,వివిధ మాధ్యమాలు ద్వారా, మానవ హక్కులు,ఆర్ టి ఐ చట్టం విధి విధానాలను పెంపొందించడం లో ప్రతి నేత, ప్రతి సభ్యులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారితో పాటు నరసరావు పేట, పల్నాడు జిల్లా నుంచి తిరుపతి కి విచ్చేసిన బి జె పి నాయకులు ఆర్.రామకృష్ణ, జనసేన ఆస్ట్రేలియా కన్వీనర్ ఎన్ ఆర్ ఐ నేత జి.రవి, జనసేన రాష్ట్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ బి. అనిల్ తో, వివిధ స్వచ్ఛంధ సామాజిక స్పృహ అంశముల మీద చర్చించి తిరుపతి ఎఫ్ ఆర్ టి ఐ నాయకత్వ ప్రతినిధుల టీమ్,వారిని గౌరవ పూర్వకంగా శాలువా లతో సన్మానించడం జరిగింది.

## ఉత్తరాంధ్ర తీరానికి చేరువైన తీవ్ర వాయుగుండం.. అత్యంత భారీ వర్షా లు కురుస్తాయన్న ఐఎండీ

- **బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం**
- **ఉత్తరాంధ్ర తీరానికి చేరువలో కేంద్రీకృతం**
- **మరికొన్ని గంటల్లో విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం**
- **కోస్తాంధ్రలో అత్యంత భారీ వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక**
- **గంటకు 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం**
- **రాయలసీమలోనూ పలుచోట్ల భారీ వర్షా లు పడతాయని అంచనా**



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తర కోస్తాంధ్ర తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది గంటల్లోనే తీరాన్ని దాటనుండటంతో ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) హెచ్చరించింది. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాతావరణ శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 7 కిలోమీటర్ల వేగంతో పశ్చిమవాయవ్య దిశగా కదులుతోంది. బుధవారం సాయంత్రం 5:30 గంటల సమయానికి ఇది ఉత్తరాంధ్ర తీరానికి అత్యంత సమీపంలో, కళింగపట్నానికి నైరుతి దిశగా 30 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి ఈశాన్యంగా 90 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం రానున్న 3 నుంచి 4 గంటల్లో విశాఖపట్నం, ఒడిశాలోని గోపాల్‌పూర్ మధ్య, కళింగపట్నానికి సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

*** భారీ నుంచి అత్యంత భారీ వర్షా లు**

వాయుగుండం ప్రభావంతో రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర, యానాంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా, ఉత్తర కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, కొన్నిసార్లు గాలి వేగం గంటకు 70 కిలోమీటర్లకు చేరుకోవచ్చని తెలిపారు. రాయలసీమలోనూ అనేక చోట్ల తేలికపాటి జల్లులు, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. వాయుగుండం తీరం దాటిన తర్వాత క్రమంగా బలహీనపడుతుంది. సెప్టెంబర్ 24 తర్వాత వర్షాల తీవ్రత తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, మరో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, బలమైన గాలులు కొనసాగవచ్చని అధికారులు సూచించారు. తీరప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో... విశాఖ, మన్యం, విజయనగరం జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

### ఉద్యోగులకు డబుల్ బొనాంజా,

## కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు.. ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు

- **ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం**
- **రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి**
- **మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్**
- **తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు**
- **ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర**



ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ.22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

**జగన్ పై మంత్రి ఫైర్**

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజా స్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు. డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

*** కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్**

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది. ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

*** పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు**

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది. కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగులకు డబుల్ బొనాంజా: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

*** అమరావతి పునరుజ్జీవం.. రైతులకు న్యాయం**

అసెంబ్లీకి రూ.661 కోట్లు: అమరావతిలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, తెలుగు ప్రజలు గర్వపడేలా శాసనసభ భవనం నిర్మించేందుకు రూ.661 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాజధానిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం మరో రూ.1,543.98 కోట్లను కేటాయించారు.

చిన్న రైతులకు భరోసా: భూ సమీకరణ పథకం కింద ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు కూడా ఎకరాకు వర్తించే విధంగా వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**ఇతర ముఖ్యమైన నిర్ణయాలు**

మద్యం పాలసీ: మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరిస్తూ, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10 లక్షల జరిమానా, రెండోసారి లైసెన్స్ రద్దు చేయాలని నిర్ణయించారు. షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ: మూతపడిన సహకార చక్కెర కర్మాగారాల (చోడవరం, గోవాడ మొదలైనవి) సమస్యల పరిష్కారానికి, రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం రుణం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. సామాజిక మీడియా పాలసీ: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాలసీ'కి ఆమోదం తెలిపారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వారికి పారితోషికం చెల్లిస్తారు. న్యాయాధికారుల పదవీ విరమణ: న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్డినెన్స్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు. భూ కేటాయింపులు: సాగర్మాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు ఏపీఐఐసీకి రూ.2,500 కోట్ల టర్మ్ లోన్ వినియోగానికి, విజయనగరంలో మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ కోసం డీఆర్‌డీఏకు ఉచితంగా భూమి కేటాయింపు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు. సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు: వార్డు సచివాలయాల్లోని పలు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు, ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు ఉద్యోగ, రైత, ప్రజా సంక్షేమానికి, పరిపాలన సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టమైన సందేశాన్ని పంపింది.

### భోగాపురం To దిల్లీ

## మరో విమాన సర్వీసు




విజయనగరం: భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో సర్వీసుల సంఖ్య ఒక్కొక్కటిగా పెరుగుతోంది. ఇప్పటికే ఇక్కడ నుంచి దిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాలకు విమానాలతోపాటు సింగపూర్, బ్యాంకాక్‌కు అంతర్జాతీయ సర్వీసులు నడుస్తున్నాయి. తాజాగా ఆకాశ ఎయిర్ సంస్థ ఈనెల 25 నుంచి రోజూ దిల్లీకి రానూపోనూ సర్వీసు నడపనుంది. దిల్లీ విమానాశ్రయం నుంచి ఉదయం 5.55 గంటలకు బయలుదేరి 8.20 గంటలకు భోగాపురం వచ్చే విమానం.. తిరిగి ఉదయం 9.05 గంటలకు ఇక్కడ్నుంచి బయలుదేరి 11.30 గంటలకు దేశ రాజధాని చేరుకోనుంది. భోగాపురం విమానాశ్రయం నుంచి దిల్లీకి ఆకాశ ఎయిర్ నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనుండటం సంతోషకరంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.

### తెదేపా కార్యాలయంపై దాడి కేసు..

## నిందితులపై రౌడీషీట్లకు ఆదేశం

అమరావతి: తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసు ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిందితులపై రౌడీషీట్లు తెరవాలని విజయవాడ సీపీ రాజశేఖరబాబు ఆదేశాలు జారీ చేశారు. 2021 అక్టోబర్ 19న తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి జరిగింది. కమిషనరేట్ పరిధిలోని 9 పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలకు రౌడీషీట్లు తెరవాలంటూ సీపీ కార్యాలయం నుంచి మెమోలు జారీ అయ్యాయి. ఈ జాబితాలో వైకాపా ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ సహా మాజీ కార్పొరేటర్లు, బెయిల్‌పై బయటకొచ్చిన సుమారు 20 మంది వరకు ఇతరులు ఉన్నారు.

## సాయికృష్ణ అదృశ్యం కేసుపై సుప్రీంకోర్టులో విచారణ



దిల్లీ: విజయవాడలోని కృష్ణలంక పీఎస్ పరిధిలో జరిగిన సాయికృష్ణ అదృశ్యం కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఉన్నతస్థాయి అధికారులను దర్యాప్తులో చేర్చకపోవడంపై వైకాపా ఎంపీ మద్దిల గురుమూర్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరారు. దీనిపై జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రస్తుతం హైకోర్టులో జరుగుతున్న విచారణపై స్టే విధిస్తూ.. అన్ని కేసులను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. కేసులో సీబీఐని ప్రతివాదిగా చేరుస్తున్నట్లు పేర్కొంది. పోలీసు కస్టడీలో సాయికృష్ణ మాయం కావడం చట్ట వ్యతిరేకమేనని జస్టిస్ విక్రమ్‌నాథ్ అన్నారు. కేసు వివరాలన్నీ సీల్డ్ కవర్‌లో ఉంచి సెప్టెంబర్ 30 నాటికి సుప్రీంకోర్టుకు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను వచ్చేనెల 12కి వాయిదా వేసింది.

# టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!

- **టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 51 మందిపై రౌడీ షీట్లు**
- **వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెళ్ల అప్పిరెడ్డి, నేత దేవినేని అవినాష్ పేర్లు**
- **2021 అక్టోబర్‌లో జరిగిన ఘటనపై ప్రస్తుత ప్రభుత్వంలో సీఐడీ విచారణ**
- **ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో 9 పోలీస్ స్టేషన్లలో షీట్ల నమోదు**
- **చంద్రబాబు నివాసంపై దాడి కేసును కూడా సీఐడీకి అప్పగించిన ప్రభుత్వం**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు సహా మొత్తం 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెళ్ల అప్పిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ వంటి ప్రముఖుల పేర్లు ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వివరాల్లోకి వెళితే, 2021 అక్టోబర్ 19న గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. ఈ ఘటనపై తాజాగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలకు రౌడీ షీట్లు తెరవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఈ దాడి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి టీడీపీ అధికార



ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో వైసీపీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కర్రలు, సుత్తులతో కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఆవరణలో నిలిపి ఉంచిన కార్లను కూడా ధ్వంసం చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో తలశిల రఘురాం, దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సహా మొత్తం 110 మందిపై కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 147, 148, 323, 324, 326, 307, 380, 427, 459, 452, 506 రెడ్ విత్ 109, 120బి, 149 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 2024 జూన్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుపై మళ్లీ దృష్టి సారించింది. 2024 అక్టోబర్‌లో ఈ కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో పాటు 2021 సెప్టెంబర్‌లో చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసును కూడా సీఐడీ విచారణకు బదిలీ చేసింది. తాజా పరిణామాలతో పాత కేసుల దర్యాప్తులో వేగం పుంజుకోవడం, వైసీపీ నేతలపై రౌడీ షీట్లు తెరవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఏపీ ఇంటర్ విద్యార్థులకు ముఖ్య గమనిక..
# పరీక్ష ఫీజు తేదీల ప్రకటన

- **ఏపీ ఇంటర్ 2027 పబ్లిక్ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల**
- **సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 29 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం**
- **రూ.1,000 ఆలస్య రుసుముతో నవంబర్ 10 వరకు గడువు**
- **గడువు తేదీలను పొడిగించేది లేదని స్పష్టం చేసిన విద్యామండలి**

ఆంధ్రప్రదేశ్‌లో 2027లో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ విద్యామండలి విడుదల చేసింది. విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఈ గడువు తేదీలను గమనించి సకాలంలో ఫీజు చెల్లించాలని బోర్డు అధికారులు సూచించారు. విద్యామండలి వెల్లడించిన వివరాల ప్రకారం, ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సాధారణ ఫీజు చెల్లింపునకు 2026 సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 29 వరకు అవకాశం కల్పించారు. ఈ గడువులోగా ఫీజు చెల్లించని విద్యార్థులు, రూ. 1,000 ఆలస్య రుసుముతో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 10 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

* **పరీక్ష ఫీజుల వివరాలు ఇలా ఉన్నాయి:**

ప్రథమ లేదా ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలకు: రూ. 600
రెండు సంవత్సరాల థియరీ పరీక్షలకు కలిపి: రూ. 1,200
సీనియర్ ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు: రూ. 275
బ్రిడ్జ్ కోర్సుకు: రూ. 165

నిర్ణీత గడువు ముగిసిన తర్వాత ఫీజు చెల్లింపు తేదీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ప్రసక్తే లేదని ఇంటర్ విద్యామండలి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా ఫీజు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

# తిరుమలలో వైభవంగా చక్రస్నానం.. ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- **శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు**
- **నేడు చక్రస్నానం**
- **పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు**
- **మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం**
- **8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ**
- **సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడు**



కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు. అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు. అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆగమ శాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

* **విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు. ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఏపీ హైకోర్టులో ఐదుగురు అదనపు జడ్జిలకు శాశ్వత న్యాయమూర్తుల హోదా

* **కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు**




దిల్లీ: ఏపీ హైకోర్టు లో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న ఐదుగురికి శాశ్వత న్యాయమూర్తుల హోదా కల్పించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం బుధవారం కేంద్రానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు సిఫారసు చేసిన వారిలో జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ (టీసీడీ శేఖర్), జస్టిస్ చల్లా గుణరంజన్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు పేర్లున్నాయి. రాష్ట్రపతి ఉత్తర్వుల జారీ తర్వాత వీరు శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణం చేస్తారు. జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లు హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా 2024 అక్టోబరు 28న ప్రమాణం చేశారు. జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావులు 2025 జనవరి 24న అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణం చేసిన విషయం తెలిసిందే.

## 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు
# కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం

- **ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్వింద్ భదౌరియా**
- **తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్**
- **ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి**




రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు.

- తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).
- ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.
- తమిళనాడు: రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కోఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు.
- ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహఇంచార్జ్‌గా నియమితులయ్యారు.
- కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.
- ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ ఇంచార్జ్‌లను కేటాయించారు.
- మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ ఇంచార్జ్‌లుగా నియమించారు.
- ఛత్తీస్‌గఢ్ హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.
- ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కోఇంచార్జ్‌లుగా నియమించారు.
- గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.
- హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.
- మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.




## ఇంటి వద్దకే 'మీ సేవ'..
# సర్వీసు ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: ఇంటి వద్దకే మీ సేవ సర్వీసులు పేరిట మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్‌ను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. హైదరాబాద్ ఆర్టీసీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన పోర్టల్‌ను శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసినా లేదా మీసేవ పోర్టల్ ద్వారా స్లాట్‌ను బుక్‌చేసుకుంటే.. మీసేవ ఎగ్జిక్యూటివ్ ఇంటి వద్దకే వస్తారని పేర్కొన్నారు. ఇంటివద్దనే.. జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు.. ఇలా 'మీ సేవ' ద్వారా అందించే అన్ని ముఖ్యమైన పౌర సేవలు అందిస్తారని మంత్రి వివరించారు. ఇందుకోసం 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టామని.. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని మంత్రి చెప్పారు.

# రిమ్స్ అగ్ని ప్రమాద బాధితులకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

ఆదిలాబాద్ కలెక్టరేట్: రిమ్స్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పరిహారాన్ని అందించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారని తెలిపారు. అవసరమైతే చిన్నారులను హైదరాబాద్‌లోని కార్పొరేట్, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించాలని మంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు.



# ఈనెల 25న క్యూర్ పరిధిలో సెలవు

హైదరాబాద్: ఈనెల 25న గణేశ్ నిమజ్జనం సందర్భంగా క్యూర్ పరిధిలో ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈనెల 25కు బదులుగా నవంబర్ 14 రెండో శనివారం పనిదినంగా పేర్కొంటూ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

# H-1B ఫ్రాడ్‌పై అమెరికా దర్యాప్తు ముమ్మరం.. ఐటీ కంపెనీల్లో ఆందోళన

అమెరికాలో ప్రకంపనలు సృష్టిస్తున్న H1B వీసాల వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. H1B సహా ఇతర ఫారిన్‌లేబర్ ప్రోగ్రామ్‌లలో ఏకంగా 20 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.8 లక్షల కోట్లకు పైగా) భారీ మోసం జరిగినట్లు తమ దర్యాప్తులో వెల్లడైందని అమెరికా కార్మిక శాఖ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో సంచలన ఆరోపణలు చేశారు. ఈ మోసాలపై కేసులు నమోదు చేస్తున్నామని, త్వరలోనే అరెస్టులు ఉంటాయని ఆయన హెచ్చరించారు. వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నేతృత్వంలోని వైట్ హౌస్ టాస్క్‌ఫోర్స్‌తో కలిసి జరిపిన పరిశీలనలో ఈ భారీ మోసం వెలుగు చూసిందని ఆంథోనీ డి'ఎస్పోసిటో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'X'లో పేర్కొన్నారు. "మేము చర్యలు తీసుకుంటున్నాం. కేసులు సిద్ధమవుతున్నాయి. సంకెళ్లు బిగించబోతున్నాం," అని ఆయన తన పోస్టులో తీవ్రంగా హెచ్చరించారు. అయితే, ఈ 20 బిలియన్ డాలర్ల సంఖ్యను ఎలా లెక్కించారనే దానిపై స్పష్టమైన ఆడిట్ నివేదిక గానీ, కేసుల వారీగా వివరాలు గానీ, కోర్టు ఫైలింగులు గానీ ఇంతవరకు బహిర్గతం కాలేదు. ఈ ఆరోపణలకు సంబంధించి ఏ కంపెనీలు లేదా వ్యక్తులపై కేసులు ఉన్నాయో కూడా డి'ఎస్పోసిటో వెల్లడించలేదు.




**దర్యాప్తు ముమ్మరం.. కంపెనీలపై చర్యలు**

H1B వీసా ప్రోగ్రామ్, పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ (PERM) వ్యవస్థలో జరుగుతున్న మోసాలు, మానవ అక్రమ రవాణాపై అమెరికా కార్మిక శాఖ ఇన్స్‌పెక్టర్ జనరల్ కార్యాలయం జూలై 8, 2026న అధికారికంగా దర్యాప్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా నకిలీ దరఖాస్తులు, బలవంతపు వేతన వసూళ్లు, తక్కువ జీతాలకు విదేశీ ఉద్యోగులను నియమించుకోవడం వంటి అంశాలపై దృష్టి సారించారు. ఈ దర్యాప్తులో భాగంగా ఇప్పటికే పలు కీలక టెక్నాలజీ కంపెనీలపై చర్యలు తీసుకున్నారు. సెప్టెంబర్ 8న ప్రముఖ ఐటీ సంస్థలు కాగ్నిజెంట్, క్లౌడెరాల PERM ఫైలింగ్‌లను సస్పెండ్ చేశారు. ఈ కంపెనీలకు సంబంధించిన H1B వీసాల ప్రాసెసింగ్‌ను కూడా నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. 2026 జూన్ 30 నాటికి కాగ్నిజెంట్ 3,510 H1B వీసాలను పొందినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

* **కఠిన నిబంధనలు.. ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్**

ఈ వ్యవహారంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తీవ్రంగా స్పందించారు. H1B ప్రోగ్రామ్‌ను దుర్వినియోగం చేస్తున్న కంపెనీలపై కఠిన చర్యలు తీసుకునేలా సెప్టెంబర్ 18న ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. దీని ప్రకారం, H1B వీసా స్పాన్సర్ చేస్తున్న కంపెనీ గతంలో అమెరికన్ ఉద్యోగులను తొలగించిందా లేదా భవిష్యత్తులో తొలగించే ప్రణాళికలు ఉన్నాయా అనే దానిపై విచారణ జరుపుతారు. పాత లేబర్ కండిషన్ అప్లికేషన్లను కూడా పునఃసమీక్షించాలని ఆదేశించారు. దీంతో పాటు, కొన్ని H1B వీసాల జారీకి తప్పనిసరిగా 100,000 డాలర్లు చెల్లించాలన్న నిబంధనను మరో 12 నెలల పాటు పొడిగించారు. H1B వీసాలపై ఆధారపడే వారిలో భారతీయులే అధికంగా ఉన్నందున, ఈ పరిణామాలు భారతీయ టెక్కీలు, ఐటీ కంపెనీలలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వం చేస్తున్న ఆరోపణల నిజానిజాలు కోర్టు విచారణలో తేలిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది.

## ఒమన్ తీరంలో నౌకపై దాడి.. భారతీయుడి మృతి

భారత్‌కు వస్తున్న నౌకపై ఒమన్ తీరంలో జరిగిన దాడిలో ఓ భారతీయుడు మృతి చెందాడు. ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ''భారత్ వైపు ప్రయాణిస్తున్న 'MV Cape Dao' నౌకపై జరిగిన దాడిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతి చెందాడు. నౌకలోని 19 మంది భారతీయులు సహా సిబ్బంది భద్రత కోసం ఒమన్ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం. మృతుడి కుటుంబంతో టచ్‌లో ఉన్నాం'' అని భారత ఎంబసీ 'ఎక్స్' వేదికగా తెలిపింది. ఎవరు దాడి చేశారన్నది తెలియరాలేదు. మృతుడిని ఉత్తర్‌ప్రదేశ్‌కు



చెందిన సూరజ్ యాదవ్‌గా గుర్తించినట్లు 'ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా' (FSUI) వెల్లడించింది. ''నౌకలోని ఇంజిన్, వసతి గదులపై టార్పిడోలతో దాడులు జరిగాయి. ఆ సమయంలో నౌకలో మొత్తం 28 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 20 మంది భారతీయులే. నావికుల భద్రతకు సంబంధించి హామీలన్నీ బుట్టదాఖలవుతున్నాయి. హర్మూజ్‌తోపాటు దాని పరిసరాల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. సూరజ్ యాదవ్ కుటుంబానికి న్యాయం చేయాలి. అదేవిధంగా ప్రతి భారతీయ నావికుడికి సురక్షిత ప్రయాణం కల్పించాలి'' అని డిమాండ్ చేసింది.

## 'బెంగాల్‌లో రీపోలింగ్ పెట్టాలి'.. 'సర్' వివాదం వేళ మమతా బెనర్జీ

ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' అంశంలో ఎన్నికల సంఘం నిర్ణయాల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా, ఈసీ అక్రమాలకు పాల్పడ్డాయని ఇప్పుడు రుజువైందన్నారు. పాత ఓటర్ల జాబితాతో రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలన్నారు. ఈ వ్యవహారంపై చర్చించేందుకు 'ఇండియా' కూటమి త్వరలోనే సమావేశమవుతుందని వెల్లడించారు. మరోవైపు.. శివసేన (యూబీటీ) చీఫ్, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే సైతం తమ రాష్ట్రంలో మళ్లీ



ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విపక్షాల ఆరోపణలను భాజపా తప్పుపట్టింది. అధికారిక చర్చల్లో ఎన్నికల కమిషనర్లు భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారంటూ వచ్చిన కథనాలు.. ఈసీ ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేస్తోందనడానికి నిదర్శనమని తెలిపింది. ఎన్నికల సంఘం, ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయంటూ ఆరోపిస్తున్న ప్రతిపక్షాలన్నీ నేడు స్వీయ ఉచ్చులో చిక్కుకున్నాయని భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర వ్యాఖ్యానించారు. ''ఓట్ల తొలగింపుతోనే బెంగాల్‌లో భాజపా గెలిచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అవే నిజమైతే.. పెద్దమొత్తంలో ఓట్లు తొలగించిన 20 స్థానాల్లో.. భాజపా కేవలం ఆరు చోట్ల విజయం సాధించింది. ఓట్ల చోరీకి పాల్పడి ఉంటే.. సగానికిపైగా స్థానాలను ఎలా కోల్పోయాం?'' అని ప్రశ్నించారు.

## 'ఐదేళ్ల బీటెక్' పరిశీలించండి.. ఐఐటీ దిల్లీ మాజీ డైరెక్టర్ ప్రతిపాదన

ఇటీవల బాంబే ఐఐటీలో ఓ విద్యార్థి ఆత్మహత్యపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ఐఐటీ దిల్లీ మాజీ డైరెక్టర్, బిట్స్ పిలానీ క్యాంపసెస్ గ్రూప్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.రామ్‌గోపాల్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యా ప్రమాణాలు తగ్గకుండా విభిన్న నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థులకు ఫ్లెక్సిబుల్ లెర్నింగ్ విధానాన్ని అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థుల అభ్యసన వేగం, వారి అకడమిక్ ప్రిపరేషన్‌లో అంతరాలను అధిగమించేందుకు ఐఐటీల్లో ఐదేళ్ల బీటెక్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలించాలని ప్రతిపాదించారు. విద్యార్థుల నేపథ్యం, వారి సామర్థ్యాల్లో తేడాలను ప్రస్తుతం ఐఐటీల్లో ఉన్న 'అందరికీ ఒకేరకమైన విధానం' పరిగణనలోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. విద్యార్థులంతా ఒకే వేగంతో నేర్చుకోలేరనే విషయాన్ని గమనించి విద్యా ప్రమాణాలను పాటిస్తూ.. అందుకనుగుణంగా వారికి తగిన సమయం, సహకారం అందించాల్సి అవసరం ఉందన్నారు. ఐఐటీ విద్యార్థి ఆత్మహత్య ఘటనతో ప్రొఫెసర్ డి.సూర్యనారాయణ చుట్టూ వివాదం నెలకొనడంపై రామ్‌గోపాల్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ''ప్రొఫెసర్ డి.సూర్యనారాయణపై జరుగుతోన్న దుష్ప్రచారం నన్ను కలవరపరిచింది. సూర్యానారాయణ నాకు వ్యక్తిగతంగా తెలుసు. ఆయన అత్యుత్తమ అధ్యాపకుల్లో ఒకరు. నైతిక విలువలు ఉన్న వ్యక్తి. ప్రస్తుతం వ్యక్తమవుతున్న ఆందోళనలను నిష్పాక్షికంగా పరిశీలించాలి తప్ప.. ఓ వ్యక్తికి వ్యతిరేకంగా బహిరంగ ప్రచారం చేయడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదు'' అన్నారు. ''ప్రస్తుతం ఎక్కువమంది విద్యార్థులు కోచింగ్ సంస్కృతి నుంచి వస్తున్నారు. రకరకాల ర్యాంకులు సాధించిన విద్యార్థులందరూ తరగతి గదుల్లో ఒకచోట కలుస్తున్నారు. వీరంతా ఒకే వేగంతో నేర్చుకుంటారని ఆశించలేం. వివిధ నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఐఐటీలు తలుపులు తెరవడంలో తప్పులేదు.. కానీ, బోధన, అభ్యసన పద్ధతుల్లో ఈ వైవిధ్యాన్ని ఐఐటీలు పరిగణనలోకి తీసుకున్నాయా? లేదా? అనేదే ప్రధానమైన ప్రశ్న. అధ్యాపకులు సైతం అన్ని తరగతుల్లోనూ ఒకే స్థాయిలో బోధించలేరు. నెమ్మదిగా చెబితే కొందరు విద్యార్థులు ఆసక్తిని కోల్పోతారు.. మరీ వేగంగా చెబితే మరికొందరు వెనకబడిపోతారు'' అని రామ్‌గోపాల్‌రావు వివరించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అద్భుతమైన ర్యాంకులు సాధించిన విద్యార్థులు కూడా తన క్లాస్‌లో ఇబ్బంది పడటాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఇది అడ్మిషన్ కేటగిరీకి సంబంధించిన సమస్య కాదని.. కోచింగ్ నుంచి




స్వతంత్రంగా నేర్చుకొనే విధానానికి మారడం ఎవరికైనా కష్టంగానే అనిపించవచ్చన్నారు. ఈ సమస్యకు పరిష్కార మార్గంగానే ఐఐటీలు ప్రస్తుతం ఉన్న నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్ వ్యవధిని ఐదేళ్లకు పెంచే విషయాన్ని పరిశీలించాలని తాను ప్రతిపాదిస్తున్నట్లు రామ్‌గోపాల్‌రావు పేర్కొన్నారు. దీనివల్ల నిర్దేశిత క్రెడిట్ నిబంధనలు పూర్తి చేసే విద్యార్థులు తమ డిగ్రీని నాలుగేళ్లు లేదా మూడున్నరేళ్లలోనే పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. మిగతా విద్యార్థులు మాత్రం తమ కోర్సులను ఐదేళ్లకు విస్తరించుకొనే అవకాశం ఉంటుందన్నారు. వారికి రికార్డు చేసిన లెక్చర్లు, ఆన్‌లైన్ మెటీరియల్ వంటి అదనపు అకడమిక్ సహాయం కూడా అందివ్వాలన్నారు. తద్వారా ఐదో సంవత్సరం చదువుతున్నారన్న కారణంగా వారిని ప్రత్యేకంగా ఎవరూ వేలెత్తి చూపే అవకాశం కూడా ఉండదన్నారు.

## సీఏ ఫౌండేషన్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

సీఏ ఫౌండేషన్, సీఏ ఇంటర్ పరీక్షలకు షెడ్యూల్ ఖరారైంది. ఈ కోర్సుల పరీక్ష తేదీలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ICAI) బుధవారం వెల్లడించింది. సీఏ ఫౌండేషన్, సీఏ ఇంటర్ కోర్సులకు 2027 జనవరిలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. సీఏ ఇంటర్ పరీక్షలు రెండు గ్రూపులుగా నిర్వహిస్తుండగా.. గ్రూప్1 పరీక్షలు జనవరి 2, 4, 6 తేదీల్లో, గ్రూప్2 పరీక్షలు జనవరి 8, 10, 12 తేదీల్లో జరగనున్నాయి. రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే, సీఏ ఫౌండేషన్ పరీక్షలు జనవరి 3, 5, 7, 9 తేదీల్లో జరగనున్నాయి. ఫౌండేషన్ పేపర్1, పేపర్ 2 పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి



సాయంత్రం 5గంటల వరకు జరగనుండగా.. పేపర్3, పేపర్4 పరీక్షలు మాత్రం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు జరుగుతాయని ఐసీఏఐ ఓ ప్రకటనలో పేర్కొంది.

## సర్‌పై ఈసీలోనే అసమ్మతి అంటూ కథనాలు.. స్పష్టతనిచ్చిన ఎన్నికల సంఘం

సర్ ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం సభ్యుల మధ్యే ఏకాభిప్రాయం లేదంటూ జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాయి. దీనిపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఈ నేపథ్యంలో ఈసీ అధికారులు స్పష్టతనిచ్చారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ప్రస్తుతం సర్ ప్రక్రియ జరుగుతోంది. ఈ ప్రక్రియలోని వివిధ అంశాలపై



ఇద్దరు కమిషనర్లు 14 సార్లు అభ్యంతరం వ్యక్తంచేశారని.. కొన్ని నిర్ణయాలపై తమకు సమాచారం ఇవ్వకుండానే అమలు చేశారని పేర్కొన్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డాయి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశాయి. అయితే.. ఈ కథనాలను ఈసీ అధికారులు ఖండించారు. సర్ ప్రక్రియపై ఎన్నికల కమిషనర్లు సూచనలు మాత్రమే చేశారని, వాటిని ఎన్నికల సంఘం సరిదిద్దిందని చెప్పారు. నిర్ణయాలన్నీ ఏకాభిప్రాయంతో తీసుకున్నవేనని స్పష్టం చేశారు.

## సీబీఎస్ఈ లోపాలను బయటపెట్టిన నిసర్గకు.. అరుదైన గౌరవం

సీబీఎస్ఈ ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలను బయటపెట్టిన 19 ఏళ్ల నిసర్గ అధికారికి అరుదైన గౌరవం దక్కింది. అమెరికా న్యాయ విభాగానికి చెందిన హాల్ ఆఫ్ ఫేమ్‌లో అతడి పేరును చేర్చారు. దీనిపై నిసర్గ మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ సిస్టమ్‌లో సైబర్ సెక్యూరిటీకి సంబంధించి ఒక పెద్ద లోపాన్ని కనుగొన్నానన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు నివేదిక పంపిన వెంటనే వారు దానిని సరి చేశారని తెలిపారు. తాను చేసిన సహాయాన్ని గుర్తించి అమెరికా న్యాయ విభాగం హాల్ ఆఫ్ ఫేమ్‌లో తన పేరును చేర్చిందని నిసర్గ వెల్లడించాడు. అయితే తాను కనుగొన్న లోపం ఏమిటి?, ఏ సిస్టమ్‌లో ఉందనే వివరాలు పంచుకోలేదు. 'యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ వెబ్‌సైట్‌ను బ్రౌజ్ చేస్తున్నప్పుడు.. కొన్ని కస్టమ్ స్క్రిప్ట్‌లను ఉపయోగించి ఈ లోపాన్ని కనుగొన్నాను. వెంటనే డీఏజీకీ, అమెరికా మిలిటరీకి ఈ విషయాన్ని తెలియజేశాను. వారు సరిచేశారు. యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్/యూఎస్ మిలిటరీ




సిస్టమ్‌లో కూడా పలు లోపాలు కనుగొన్నాను. వాటిని పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు' అని నిసర్గ పేర్కొన్నారు. నిసర్గ అధికారి ఈ ఏడాదే 12వ తరగతి పూర్తిచేశాడు. అతడి కుటుంబంలో ఎవరూ సైబర్ సెక్యూరిటీ రంగంలో లేరు. తల్లిదండ్రులిద్దరూ ఫైనాన్స్ రంగంలో పనిచేస్తున్నారు. కోడింగ్ మీదున్న ఆసక్తితో ఆరేళ్ల వయసు నుంచే దాన్ని నేర్చుకోవడం మొదలుపెట్టాడు. ఇటీవల సీబీఎస్ఈలోని ఆన్ స్క్రీన్ మార్కింగ్ పోర్టల్‌లో లోపాలను గుర్తించిన నిసర్గ.. ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ సెక్యూరిటీ విభాగం సెర్ట్‌ఇన్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో అతడి పేరు జాతీయ మీడియాలో మార్మోగింది.

## 'పీవోకేలో దురాగతాలు'.. ఐరాసలో పాక్‌ను ఎండగట్టిన కశ్మీరీ మహిళ

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లో దాయాది సాగిస్తున్న దురాగతాలను జమ్మూకశ్మీర్‌కు చెందిన ఓ మహిళా సామాజిక కార్యకర్త ఐరాస వేదికగా ఎండగట్టారు. పీవోకేలో క్షీణిస్తున్న మానవ హక్కుల పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసనలు చేస్తున్న పౌరులను పాకిస్థాన్ భద్రతా దళాలు కాల్చిచంపుతున్నాయని ఆరోపించారు. ఈ హత్యలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. 'అసోసియేషన్ ఆఫ్ టెర్రర్ విక్టిమ్స్ ఇన్ కశ్మీర్' తరఫున పనిచేస్తున్న, బారాముల్లాకు చెందిన తస్లీమా అక్తర్ యూఎన్‌హెచ్‌ఆర్‌సీ సమావేశంలో ఈమేరకు ప్రసంగించారు. ''ఆర్థిక, పాలనాపరమైన సమస్యలపై ఇటీవల పీవోకేలో శాంతియుత నిరసనలు జరిగాయి. అయితే, పాక్ ప్రభుత్వం వాటిని క్రూరంగా అణచివేసింది. వందలాది మంది కార్యకర్తలను అరెస్టు చేసింది. కీలక నేతలను నిర్బంధించింది. ఇంటర్నెట్‌ను నిలిపివేసింది. హింసాత్మక ఘర్షణల్లో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. పాక్ బలగాల ప్రతీకార చర్యలు, అమాయక పౌరుల హత్యలను వెంటనే ఆపాలి. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలి. ఈ వ్యవహారంలో యూఎన్‌హెచ్‌ఆర్‌సీ తక్షణమే జోక్యం చేసుకోవాలి'' అని తస్లీమా అక్తర్ డిమాండ్ చేశారు. మరోవైపు.. పీవోకేకు భిన్నంగా జమ్మూకశ్మీర్ అభివృద్ధి దిశగా పయనిస్తోందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా పురోగతి సాధించిందన్నారు.



ఉపాధి కల్పనతోపాటు స్థానిక వ్యాపారాలకు ఊతం లభిస్తోందని చెప్పారు. స్మార్ట్ సిటీ కార్యక్రమాలు, గ్రామీణ మౌలిక సదుపాయాలు.. అభివృద్ధిని మరింత బలోపేతం చేశాయని పేర్కొన్నారు.

## అమెరికా 'ఉగ్రచర్యల' బాధితులం : పెజెష్కియాన్

**అమెరికా ఉగ్రచర్యలకు తమ ప్రజలు బాధితులుగా మారారని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ పేర్కొన్నారు. అగ్రరాజ్యం తమపై దాడులు చేసిందని.. కానీ, తాము ఎక్కడా తలొగ్గలేదని చెప్పారు. న్యూయార్క్‌లోని ఐరాసలో 81వ సర్వ ప్రతినిధి సభ సమావేశంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. దివంగత సుప్రీం లీడర్ అలీ ఖమేనీ, యుద్ధం ప్రారంభంలో అమెరికా దాడిలో మృతి చెందిన 150 మందికి పైగా విద్యార్థుల ఫొటోలను ఆయన ఈ సందర్భంగా ప్రదర్శించారు.**




## క్రెడిట్ యుటిలైజేషన్ 30% రూల్.. ఒక్క కార్డుకా? అన్నింటికా?

క్రెడిట్ కార్డు వినియోగించే వారి సంఖ్య పెరుగుతోంది. బ్యాంకులు కూడా విరివిగా జారీ చేస్తుండడంతో ఒకటి కంటే ఎక్కువ కార్డులు వాడే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. సాధారణంగా ప్రతి కార్డుకూ ఓ పరిమితి ఉంటుంది. అలా వచ్చిన లిమిట్‌లో ఎంత శాతం వాడుకుంటున్నామో తెలిపే దాన్నే క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో అంటారు. ఈ నిష్పత్తి ఎప్పుడూ 30 శాతం మించకూడదని ఆర్థిక నిపుణులు చెప్పేమాట. మరి ఈ రూల్ ఒక్క క్రెడిట్ కార్డుకే వర్తిస్తుందా? లేదా అన్ని క్రెడిట్ కార్డులకా? రుణదాతలు క్రెడిట్ యుటిలైజేషన్ రేషియోను లెక్కించేటప్పుడు మీ వద్ద ఉన్న అన్ని క్రెడిట్ కార్డులను పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు మీ దగ్గర మూడు క్రెడిట్ కార్డులు ఉన్నాయనుకుందాం. అన్ని కార్డుల మొత్తం పరిమితి రూ.4 లక్షలు అనుకుంటే, అందులో మీరు ఉపయోగించింది కేవలం రూ.80 వేలే అయితే.. మీ క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో 20 శాతం మాత్రమే అవుతుంది. కాబట్టి ఒక దాంట్లో ఎక్కువ వాడి, మరో దాంట్లో తక్కువ వాడినా క్రెడిట్ యుటిలైజేషన్ రేషియోలో మార్పు ఉండదు. దీనివల్ల క్రెడిట్ స్కోరుకు వచ్చిన ఇబ్బందేమీ లేదు.

**అలాగని ఒకే కార్డుపై..**

అన్ని కార్డుల సగటు ఆధారంగా సీయూఆర్ లెక్కించినప్పటికీ.. రివార్డులు వస్తున్నాయనో, మరో కారణం చేతనో ఒకే కార్డును అధికంగా వినియోగించడమూ మంచిది కాదంటున్నారు నిపుణులు. మీ వద్ద 3 కార్డులు ఉండి.. మొత్తం వాడకం 20 శాతంలోపే ఉన్నప్పటికీ.. అందులో ఒక కార్డు లిమిట్‌ను 90 శాతం వరకు వాడడం సరికాదంటున్నారు. మీరు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారనో, అప్పుపై ఎక్కువ ఆధారపడుతున్నారనో క్రెడిట్ బ్యూరోలు భావించి మీ క్రెడిట్ స్కోరును తగ్గించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.



**ఇలా చేయడం మంచిది**

* మీ వద్ద ఒకటి కంటే ఎక్కువ క్రెడిట్ కార్డులుంటే ఎక్కువ ఖర్చుల కోసం ఒకే కార్డుపై ఆధారపడకుండా పలు కార్డులను వాడడం ఉత్తమం.
* మీ మొత్తం క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో తక్కువగా ఉన్నప్పటికీ, ఏ ఒక్క కార్డునూ 80 శాతానికి మించి వాడొద్దు.
* ఒక కార్డును పెద్ద ఖర్చుల కోసం వాడాల్సి వస్తే, ఆ బిల్లు క్రెడిట్ బ్యూరోలకు రిపోర్ట్ అయ్యేలోపే (స్టేట్‌మెంట్ తేదీకి ముందే) అందులో కొంత మొత్తాన్ని చెల్లించడం మంచిది.

## చర్చలు విఫలం..
## సమ్మెకు వెళ్లనున్న బ్యాంకు సంఘాలు



ఢిల్లీ: వారానికి ఐదు రోజుల పని విధానంతో పాటు పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ బ్యాంకు యూనియన్లు మరోసారి సమ్మెకు సిద్ధమవుతున్నాయి. సెప్టెంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నాయి. ఆర్థిక శాఖ సూచన మేరకు డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో మంగళవారం జరిపిన చర్చలు విఫలం కావడంతో దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధమవుతున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రకటించింది. బ్యాంకు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, ఐదు రోజుల పని అంశం కూడా ప్రస్తుతం పరిశీలనలో ఉందని చర్చల సందర్భంగా ప్రభుత్వం పేర్కొంది. అయితే, వారానికి 5 రోజుల పని విధానాన్ని ప్రవేశపెట్టాలన్న తమ డిమాండ్ దిశగా సానుకూల పరిణామాలు కనిపిస్తే అప్పుడు సమ్మె వాయిదా గురించి పరిశీలిస్తామని యూఎఫ్‌బీయూ ప్రకటించింది. మరోవైపు సమ్మెకు ముందు శని, ఆదివారాలు బ్యాంకులు తెరుచుకోవు. 28 నుంచి 30 వరకు సమ్మె కారణంగా మూతపడనున్నాయి. దీంతో మొత్తం ఐదు రోజులు పాటు బ్యాంకు సేవలకు ఆటంకం కలగనుంది. ఈ నెల సెప్టెంబర్ 11న కూడా బ్యాంకు యూనియన్లు సమ్మె నిర్వహించిన సంగతి తెలిసిందే.

## ట్రాయ్ ఆదేశాలు.. ఇక మరిన్ని వాయిస్+SMS రీఛార్జి ప్లాన్స్

వాయిస్, ఎస్సెమ్మెస్ ప్రయోజనాలతో మరిన్ని స్పెషల్ టారిఫ్ వోచర్లను అందించాలని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ టెల్కోలను ఆదేశించింది. వాయిస్+ ఎస్సెమ్మెస్ ప్రయోజనాలు కలిగిన రీఛార్జి ఆప్షన్లు పరిమితంగా ఉన్నాయని, అధిక వ్యాలిడిటీ కలిగిన ప్లాన్లే ఎక్కువగా ఉన్నాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో తక్కువ కాలవ్యవధితో అందుబాటు ధరలో ఈ స్పెషల్ టారిఫ్ వోచర్లను అందించాలని టెలికాం కంపెనీలను ఆదేశించింది. వాయిస్, ఎస్సెమ్మెస్ ప్లాన్లపై గతేడాది ఏప్రిల్ 7న సంప్రదింపుల పత్రాన్ని ట్రాయ్ విడుదల చేసింది. దీనిపై భాగస్వామ్యపక్షాల నుంచి అభిప్రాయాలను సేకరించింది. 1132 మంది తమ అభిప్రాయాలను తెలియజేశారు. జూన్ 15న ఓపెన్ హౌస్ డిస్కషన్ కూడా నిర్వహించింది. ఈ క్రమంలోనే



టెలికాం కన్జూమర్ ప్రొటెక్షన్ (13వ సవరణ) రెగ్యులేషన్, 2026 నిబంధనలను తాజాగా జారీ చేసింది. దీని ప్రకారం.. వాయిస్, ఎస్సెమ్మెస్, డేటా ప్లాన్ల మాదిరిగానే వాయిస్, ఎస్సెమ్మెస్ ప్రయోజనాలతో కూడిన ప్లాన్లనూ అన్ని కాలవ్యవధులకు అందుబాటులో ఉంచాలని సూచించింది. 30 రోజులతో పాటు.. 30 రోజుల కంటే తక్కువ వ్యాలిడిటీ కలిగిన ప్లాన్లు కూడా ఉండాలని సూచించింది. ఆపరేటర్లు ప్రతి నెలా ఒకే తేదీన రెన్యువల్ చేసుకోగలిగే వ్యాలిడిటీతో వాయిస్, ఎస్సెమ్మెస్‌లు ఉండే ఎస్‌టీవీలను అందించాల్సి ఉంటుంది. దీనివల్ల తక్కువ ఆదాయ వర్గాల వారు తమ అవసరాలకు అనుగుణంగా రీఛార్జు చేసుకునే వెసులుబాటు లభిస్తుందని ట్రాయ్ తెలిపింది. ట్రాయ్ ఆదేశాల నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు స్వల్పంగా క్షీణించగా.. వొడాఫోన్ ఐడియా షేర్లు 2 శాతం మేర రాణించాయి.

## హోండా నుంచి మరో ఎలక్ట్రిక్ స్కూటర్..
## ధర, రేంజ్ వివరాలు ఇవే!

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా మార్కెట్లోకి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ హోండా QC3ని విడుదల చేసింది. దీని ధరను రూ.1.35 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్, దిల్లీ) నిర్ణయించింది. గతంలో యాక్టివా eలో స్వాపబుల్ బ్యాటరీ ఇవ్వగా.. ఇందులో మాత్రం 3kWh ఫిక్స్‌డ్ బ్యాటరీ వాడారు. ఈ స్కూటర్ సర్టిఫైడ్ రేంజ్ 145 కిలోమీటర్లుగా కంపెనీ పేర్కొంది. భారత్‌లో హోండా తీసుకొచ్చిన ఈవీల్లో అత్యధిక రేంజ్ కలిగిన స్కూటర్ ఇదే కావడం గమనార్హం. ఈ స్కూటర్‌ను 080 శాతం ఛార్జ్ చేయడానికి 2.40 గంటల సమయం పడుతుందని కంపెనీ చెబుతోంది. పూర్తి ఛార్జింగ్‌కు 4 గంటలు తీసుకుంటుంది. ఇందులో 5 అంగుళాల టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంది. హోండా రోడ్‌సింక్ కనెక్టివిటీ, టర్న్ బై టర్న్ నావిగేషన్, 32 లీటర్ల అండర్‌సీట్ స్టోరేజీ ఉన్నాయి.





## స్వర్ణ కాంతలు

* **టైటిల్ నిలబెట్టుకున్న హర్మన్‌ప్రీత్ బృందం**
* **2026 ఆసియా క్రీడల్లో భారత్ ఖాతాలో తొలి పసిడి**

**ఆసియా క్రీడల్లో పసిడి కోసం నిరీక్షిస్తున్న అభిమానులను మురిపిస్తూ మూడో రోజు భారత శిబిరంలో స్వర్ణకాంతులొచ్చాయి. భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా ఖండంలో తన ఆధిపత్యాన్ని చాటుతూ వరుసగా రెండోసారి స్వర్ణ పతకం గెలుచుకుంది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ బృందం.. శ్రీలంకను చిత్తు చిత్తుగా ఓడించింది. పోటీల మూడోరోజు భారత్‌కు లభించిన పతకం ఇదొక్కటే. బ్యాడ్మింటన్‌లో పురుషుల జట్టు.. ఉషులో రోషిబినా దేవి సెమీఫైనల్ చేరడంతో భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయమయ్యాయి.**





**నిషిన్ (జపాన్)**

డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఆసియా క్రీడల మహిళల క్రికెట్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. మంగళవారం కనీస పోటీ ఎదురుకాని ఫైనల్లో, 147 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. స్మృతి మంధాన (79; 45 బంతుల్లో 5×4, 7×6), రిచా ఘోష్ (49 నాటౌట్; 22 బంతుల్లో 6×4, 3×6), షెఫాలి వర్మ (48; 29 బంతుల్లో 3×4, 3×6) చెలరేగడంతో మొదట భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు. ఛేదనలో శ్రీలంక తేలిపోయింది. స్పిన్నర్లు దీప్తి శర్మ (3/6), షెఫాలి వర్మ (2/3), శ్రీచరణి (2/13), శ్రేయాంక (2/9) ధాటికి 15.4 ఓవర్లలో 69 పరుగులకే కుప్పకూలింది. చమరి ఆటపట్టు (29) టాప్ స్కోరర్. ఆమె కాకుండా కౌషిని (14), కవిష (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. లంక ఏ దశలోనూ పోటీలో లేదు. ఆ జట్టు 26 పరుగుల వ్యవధిలో 8 వికెట్లు చేజార్చుకుంది.

**దంచేశారు..:** ఫైనల్లో తిరుగులేని ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్.. అంచనాలకు తగ్గట్లే చెలరేగిపోయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆ జట్టుకు ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలి వర్మ అదిరే ఆరంభాన్నిచ్చారు. సుగందిక వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు దంచేసిన స్మృతి.. ఆమె తర్వాతి ఓవర్లో వరుసగా 6, 6 బాదేసింది. మిథాలి ఓవర్లో షెఫాలి రెండు ఫోర్లు, సిక్స్‌తో విరుచుకుపడింది. పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 67/0తో నిలిచింది. ఆ తర్వాత కూడా ఓపెనర్లు జోరు కొనసాగించారు. స్మృతి 30 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసింది. పదో ఓవర్లో షెఫాలి నిష్క్రమణతో 99 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యం విడిపోయింది. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (19; 17 బంతుల్లో 3×4) ధాటిగా ఆడలేకపోయినా.. స్మృతి మాత్రం తగ్గలేదు. ఆ తర్వాత వికెట్‌కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ విరుచుకుపడింది. ఫోర్లు, సిక్స్‌లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఆమె విధ్వంసంతో ఆఖరి 5 ఓవర్లలో భారత్ 74 పరుగులు రాబట్టింది. సెంచరీ చేసేలా కనిపించిన స్మృతి 17వ ఓవర్లో నిష్క్రమించగా.. పుల్మాలి (7 నాటౌట్)తో అభేద్యమైన నాలుగో వికెట్‌కు రిచా 19 బంతుల్లో 53 పరుగులు జోడించింది. మరోవైపు కాంస్యం కోసం జరిగిన పోరులో పాకిస్థాన్ 31 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది.




## అమ్మాయిలూ.. దేశం గర్విస్తోంది
## టీమ్ఇండియాపై మోదీ ప్రశంసలు



వరుసగా రెండోసారి ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత మహిళా జట్టు స్వర్ణం నెగ్గింది. తాజాగా శ్రీలంకపై 147 పరుగుల భారీ వ్యత్యాసంతో టీమ్ఇండియా విజయం సాధించింది. దీంతో ఆసియా క్రీడలు 2026 ఎడిషన్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించింది. హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమ్ఇండియా అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించింది. స్వర్ణ పతకం నెగ్గిన అమ్మాయిల జట్టుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ సహా పలువురు అభినందనలు తెలిపారు. "భారత మహిళ జట్టు సభ్యులందరికీ నా శుభాకాంక్షలు. చరిత్రలో నిలిచిపోయే విజయంతో ఈ ఎడిషన్‌లో తొలి బంగారు పతకం అందించారు. జాతి గర్వపడేలా చేశారు. అద్భుతమైన ప్రదర్శన, బృంద స్ఫూర్తి, నిబద్ధత.. రాబోయే తరాలకు మరీ ముఖ్యంగా ఆడబిడ్డలకు స్ఫూర్తిదాయకం" — ద్రౌపది ముర్ము

## భయపెట్టిన జపాన్

**కష్టంగా గెలిచిన భారత్**

సానో (జపాన్) : ఆసియా క్రీడలకు ముందు జపాన్‌తో ఏకైక టీ20 మ్యాచ్‌లో టీమ్ఇండియా చెమటోడ్చింది. మంగళవారం రసవత్తరంగా సాగిన స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో 2 పరుగుల తేడాతో నెగ్గింది. వర్షం వల్ల చాలా ఆట వృథా కాగా.. ఇన్నింగ్స్‌ను 5 ఓవర్లకు కుదించారు. బంతి ఎక్కువగా తిరగడంతో రెండు జట్ల మధ్య ఉన్న భారీ అంతరం తగ్గిపోయింది. బ్యాటింగ్‌కు చాలా కష్టంగా ఉన్న పిచ్‌పై భారత్ మొదట 4 వికెట్ల నష్టానికి 32 పరుగులే చేయగలిగింది. శ్రేయస్ (16; 12 బంతుల్లో 1×4) టాప్ స్కోరర్. జపాన్ స్పిన్నర్లు చార్లీ హరా హింజె (2/17), తకహషి ఇబ్రహీం (1/13), బెంజమిన్ డేవిస్ (1/2) భారత్‌కు కళ్లెం వేశారు. అనంతరం భారత్ కూడా స్పిన్‌తో జపాన్‌ను కట్టిపడేసింది. సుందర్ (2 ఓవర్లలో 2/13), అక్షర్ (2 ఓవర్లలో 0/7) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో స్వల్ప ఛేదనలో జపాన్.. 3 వికెట్లకు 30 పరుగులే చేయగలిగింది. ఫ్లెమింగ్ (12) టాప్ స్కోరర్. శ్రేయస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

భారత్ తడబాటు..: భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా.. మందకొడి పిచ్‌పై బంతి బాగా తిరగడంతో స్ట్రోక్‌ప్లే సాధ్యం కాలేదు. అభిషేక్ (0) తొలి ఓవర్లోనే ఔటయ్యాడు. హరా హింజె బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్ ఆడబోయిన అతడు.. ఎడ్జ్‌తో క్యాచ్ ఔటయ్యాడు. తర్వాతి ఓవర్లో ఓ ఫ్లైటెడ్ డెలివరీతో శాంసన్ (9)ను తకహషి బోల్తా కొట్టించాడు. ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన ఇషాన్ కిషన్ (3)ను మూడో ఓవర్లో డేవిస్ పెవిలియన్ చేర్చాడు.



అప్పటికి భారత్ స్కోరు 14. శ్రేయస్ కూడా ఓ బౌండరీ కొట్టినప్పటికీ ధాటిగా ఆడలేకపోయాడు. భారత జట్టు ఇన్నింగ్స్‌లో రెండే ఫోర్లు ఉండడం గమనార్హం. శ్రేయస్ ఆఖరి ఓవర్లో ఔటయ్యాడు. పిచ్ పరిస్థితి చూస్తే స్వల్ప ఛేదన కూడా కష్టమేనని అర్థమైంది. జపాన్ అందుకు తగ్గట్లే ఆడింది. మూడో ఓవర్లో బిష్ణోయ్ 10 పరుగులు ఇచ్చినా.. సుందర్, అక్షర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో జపాన్ 4 ఓవర్లలో 25/3తో నిలిచింది.. ఆఖరి ఓవర్లో ఆ జట్టుకు 8 పరుగులు అవసరం కాగా.. అక్షర్ 5 పరుగులే ఇవ్వడంతో భారత్ ఊపిరిపీల్చుకుంది. ఆ వైడ్ వెనక్కి..: జపాన్ ఛేదనలో అంపైర్ నిర్ణయం వివాదాస్పదమైంది. చివరిదైన అయిదో ఓవర్లో జరిగింది ఆ ఘటన. జపాన్ 4 బంతుల్లో ఏడు పరుగులు చేయాల్సివుంది. అక్షర్ బౌలింగ్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్.. షిరాయ్ పాత్మోర్ రివర్స్ హిట్ ఆడడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. బ్యాటర్ తన రెగ్యులర్ స్టాన్స్‌లో ఉండి ఉంటే.. బంతి అతడికి లెగ్‌సైడ్ అయ్యేది. అంపైర్ క్రిస్ తుర్గేట్ (జపాన్) దాన్ని వైడ్‌బాల్‌గా ప్రకటించాడు. దీంతో భారత ఆటగాళ్లు అసంతృప్తికి గురయ్యారు. గత పదేళ్లుగా అలాంటి బంతులను వైడ్లుగా ప్రకటించట్లేదు. సరిగ్గా అలాంటి పరిస్థితుల్లోనే తర్వాతి బంతిని కూడా అంపైర్ వైడ్ ఇచ్చాడు. దీంతో భారత క్రికెటర్లలో అసహనం పెరిగిపోయింది.



# ఆర్భాటాలు నచ్చవ్

పెళ్లి అనేది జీవితంలో తప్పనిసరి అనే సంప్రదాయ ఆలోచనతో తాను ఏకీభవించనని నటి శ్రుతి హాసన్ తెలిపింది. 40 ఏళ్ల వయసులోనూ సింగిల్‌గా ఉండడంపై తనకు ఎలాంటి అసౌకర్యం లేదని చెప్పింది. సోహా అలీఖాన్ పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్న శ్రుతి.. పెళ్లి, భాగస్వామ్యం, మాతృత్వంపై తన అభిప్రాయాలను పంచుకుంది. 'నేను పెళ్లికి వ్యతిరేకం కాదు. నాకు కంపానియన్‌షిప్ అంటే ఇష్టం. అయితే పెళ్లి కోసం భారీగా ఖర్చు చేయడం, ఆర్భాటాలు చేయడం నచ్చదు' అని పేర్కొంది. పెళ్లి అనే చట్టపరమైన బంధం కంటే ఇద్దరు వ్యక్తులు ప్రతిరోజూ ఒకరినొకరు ఎంచుకోవడం తనకు ముఖ్యమని చెప్పింది. గతంలో ఓసారి పెళ్లికి దగ్గరగా వెళ్లినప్పటికీ.. పెళ్లి అనే ఆలోచన తనను భయపెట్టలేదని తెలిపింది. పెళ్లిళ్ల కోసం భారీగా ఖర్చు చేసే డబ్బును అవసరమైన వారికి దానం చేస్తే బాగుంటుందని సరదాగా వ్యాఖ్యానించింది. మాతృత్వంపైనా స్పందిస్తూ.. దత్తత తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని, తల్లిగా మారాలని కోరుకుంటున్నానని చెప్పింది. బయోలాజికల్‌గా తల్లి కావాలనే ఆలోచనను పరిశీలించాలనుకుంటున్నట్లు తెలిపింది.



## ఒకేసారి ఓటీటీలోకి నయన్ సినిమాలు

నయనతార నటించిన రెండు సినిమాలు ఒకే రోజు ఓటీటీలోకి రానున్నాయా? ప్రస్తుతం ఇదే చర్చ నడుస్తోంది. ఇటీవల విడుదలైన 'టాక్సిక్', 'హాయ్' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. 'హాయ్'కు నయనతార నిర్మాతగానూ వ్యవహరించింది. ఈ మూవీని ఓటీటీ లైనప్‌లో భాగంగా స్ట్రీమింగ్ చేయనున్నట్లు జీ5 ఇప్పటికే ప్రకటించింది. సెప్టెంబర్ 25న స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన 'టాక్సిక్' కూడా అదే రోజు జీ5లో స్ట్రీమింగ్ కానుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో నయనతార.. యశ్ సోదరి గంగ పాత్రలో కనిపించారు. ఈ మూవీ సైతం అదే రోజు నుంచి స్ట్రీమింగ్ అవుతుందని సమాచారం. అయితే, రెండు సినిమాల ఓటీటీ విడుదలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



సినిమా

## ప్రశాంతతే ముఖ్యం ఐశ్వర్య లక్ష్మి

సోషల్ మీడియాకు దూరంగా ఉంటే ఆదాయం తగ్గుతుందని తెలిసినా మానసిక ప్రశాంతతకే ప్రాధాన్యం ఇస్తున్నానని మలయాళీ నటి ఐశ్వర్య లక్ష్మి తెలిపింది. గతేడాది ఇన్‌స్టాగ్రామ్‌కు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన నిర్ణయానికి గల కారణాన్ని వెల్లడించింది. తన పీఆర్ టీమ్, మేనేజర్లు ఇన్‌స్టాగ్రామ్‌లోకి రావాలని సూచించారని ఐశ్వర్య చెప్పింది. సోషల్ మీడియాలో లేకపోవడంతో ఆదాయం తగ్గే అవకాశం ఉందని చెప్పినప్పటికీ.. తాను మాత్రం డబ్బు కంటే ప్రశాంతతకే విలువ ఇచ్చానని పేర్కొంది. విష పూరితమైన కామెంట్స్, ట్రోలింగ్ తనను ఒత్తిడికి గురిచేసేవని తెలిపింది. దాని నుంచి బయటకు వచ్చిన తర్వాత మరింత ప్రశాంతంగా, హాయిగా ఉంటున్నానని చెప్పింది. ప్రస్తుతం మళ్లీ ఇన్‌స్టాగ్రామ్‌లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేసింది. ఐశ్వర్య లక్ష్మి ప్రస్తుతం తెలుగులో సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న 'సంబరాల ఏటిగట్టు'లో కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం 2027 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది.



## మానసతో శర్వా రొమాన్స్

హీరో శర్వానంద్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం శ్రీను వైట్ల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. 'జార్జ్ క్రిష్' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం శర్వానంద్–శ్రీను వైట్ల కాంబినేషన్‌లో వస్తున్న తొలి సినిమా కావడం విశేషం. సినిమాలో హీరోయిన్‌గా మానస వారణాసిని ఎంపిక చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇటీవల 'కపుల్ ఫ్రెండ్లీ'తో విజయాన్ని అందుకున్న మానస.. శర్వానంద్‌కు జోడీగా కనిపించనుంది. సినిమాలో శర్వానంద్ ప్రేమికురాలిగా ఆమె పాత్ర పోషించబోతోంది. ప్రేమకథకు వినోదాన్ని జోడించి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రొమాంటిక్ ట్రాక్ కీలకంగా ఉంటుందని తెలుస్తోంది. మానస పాత్రకు కథలో మంచి ప్రాధాన్యం ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నాడు.

## విషమైనా ఇవ్వండి!



రేణుకాస్వామి హత్య కేసులో నిందితురాలు పవిత్ర గౌడ జైల్లో తనను వేధి స్తున్నారని కోర్టుకు తెలిపింది. పరప్పన అగ్రహార జైలులో నైజీరియా మహిళా ఖైదీలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 'వేధింపులు ఆగడం లేదు.. నాకు విషం ఇవ్వండి' అంటూ పవిత్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. తనను ప్రత్యేక బ్యారక్‌కు తరలించాలని ఆమె కోరినట్లు చెప్పారు. ఇప్పటికే ఏడాదికిపైగా జైల్లో ఉన్నందున, కేసులో ఎక్కువ మంది సాక్షుల విచారణ పూర్తయిన నేపథ్యంలో బెయిల్ ఇవ్వాలని పవిత్ర తరఫు న్యాయవాదులు కోరారు. అయితే 60 మంది సాక్షుల విచారణ పూర్తయ్యే వరకు బెయిల్ ఇవ్వకూడదని సుప్రీంకోర్టు ఆదేశించిందని ప్రాసిక్యూషన్ వాదించింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. అభిమాని రేణుకస్వామి హత్య కేసులో కన్నడ ప్రముఖ నటుడు దర్శన్‌తో పాటు పవిత్ర గౌడ జైలులో ఉన్న విషయం తెలిసిందే.